ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 10 జూన్ 2025



బీసీ సంక్షేమంలో బదిలీలు

- 15 మంది హెచ్‌డబ్ల్యూవోల బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్

వివరాలు 8

బినామీ మస్టర్లపై విజిలెన్స్ విచారణ


ఒక్కొక్కటిగా బయటకొస్తున్న నాటి పాపాలు

ఇప్పుడున్న వాటితోపాటు మరో రెండు కేసులు

అన్నన్నా.. కాకాణీ!

'మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడు పురుగులుండు..' వేమన పద్యంలా నాడు ఎన్నో ప్రగల్భాలు పలికిన మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాపాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తవ్వుకోవడం, దండుకోవడం, అడ్డొచ్చినవారిపై దౌర్జన్యం చేయడమే లక్ష్యంగా కాకాణి, ఆయన అనుచరులు పేట్రేగిపోయారు. వీరి ఆగడాలపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఆ ఫిర్యాదుల ఫైళ్ల దుమ్మును పోలీసులు దులుపుతున్నారు. ఇప్పటికే క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో రిమాండ్‌లో ఉన్న కాకాణి ఆ కేసు నుంచి బెయిల్‌పై బయటకు రాక మునుపే మరో మూడు కొత్త కేసులు ఆయన కోసం ఎదురుచూస్తున్నాయి. అవేంటో ఈ కథనం చదవండి...

- అనధికార టోల్‌గేటు, కనుపూరు చెరువులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు
- ముత్తుకూరు, వెంకటాచలంలో కేసుల నమోదు
- ఫొటోల మార్ఫింగ్ కేసులో విచారణకు దిగిన సీఐడీ
- నేడు పీటీ వారెంట్ కింద గుంటూరుకు కాకాణి?



న్యాయస్థానం లోపల..

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో రెండు నెలలపాటు కాకాణి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం, ఆ తరువాత పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ కేసులో సోమవారం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. కాకాణికి ఎందుకు బెయిల్ మంజూరు చేయవచ్చో ఆయన న్యాయవాది తన వాదనను వినిపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదన వినిపించడానికి కొంత గడువు తీసుకున్నారు. దీంతో బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేస్తూ కాకాణి రిమాండ్‌ను ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించారు. బెయిల్ పిటిషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదన వినిపించిన తరువాత బెయిల్ వచ్చేది, లేనిది తెలుస్తుంది.



న్యాయస్థానం వెలుపల..

వైసీపీ హయాంలో 2022 నుంచి ఎన్నికల ముందు (2024) వరకు కనుపూరు చెరువులో విపరీతంగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అధికారికంగానే 2.5 లక్షల టన్నుల గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు లెక్క తేల్చారు. ఇక అనధికారికంగా ఎన్ని లక్షల టన్నులు తోలారో చెప్పడం కష్టం. ఈ గ్రావెల్ తవ్వకాల ముసుగులో కాకాణి, ఈయన అనుచరులు వందల కోట్ల రూపాయలు దండుకున్నారని ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. ఫిర్యాదులూ చేశాయి. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో దీనిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఈ కేసుకు సంబంధించి వెంకటాచలం పోలీసులు బూజు దులిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కాకాణి, ఆయన ముఖ్య అనుచరులు మందల వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డిలతో పాటు మరి కొందరి మీద కేసు నమోదయ్యింది. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించి రూరల్ డీఎస్పీ, వెంకటాచలం సీఐలు సోమవారం ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి కనుపూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులిచ్చిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

● సీన్ 2..

వైసీపీ హయాంలో పోర్టుకు వెలుపల పంటపాలెం వద్ద వైసీపీ నాయకులు ఒక అనధికారిక ప్రైవేట్ టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. పోర్టులో లోపలకు, వెలుపలకు వచ్చే వాహనాల నుంచి టోల్ ఫీజు పేరుతో రూ.500 నుంచి 1000 వరకు వసూళ్లు చేశారు. వాహనదారులు ప్రతిఘటించినా వైసీపీ నాయకులు వెనక్కు తగ్గలేదు. అధికారం అండతో వాహనదారులపై దౌర్జన్యాలు చేశారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారు. కొన్ని సందర్భాల్లో వైసీపీ నాయకులకే సహకరించారు. అప్పట్లో టోల్‌గేట్ వసూళ్ల ద్వారా కాకాణికి రోజు లక్షల రూపాయల ఆదాయం దండుకొంటున్నారని వాహనదారులు, తెలుగుదేశం నాయకులు ఆరోపించారు. అప్పుడు పెట్టిన కేసుల్లో ఇప్పుడు కదలిక వచ్చింది. గుంటూరుకు చెందిన కొందరు వాహనదారులు, దిగుమతిదారులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా సోమవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో కూడా కాకాణి, ఈయన ప్రధాన అనుచరుడు తూపిలి శ్రీధర్‌రెడ్డి తదితరులపై ముత్తుకూరులో కేసు నమోదయ్యింది.

● సీన్ 3..

నెల్లూరు కోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్‌పై వాదన జరుగుతోంది. సరిగ్గా ఆ సమయంలో గుంటూరు సీఐడీ రీజనల్ కార్యాలయం నుంచి కొంతమంది అధికారులు కోర్టు వద్దకు చేరుకున్నారు. రిమాండ్‌లో ఉన్న కాకాణిని ఒక కేసు విచారణ నిమిత్తం పీటీ వారెంట్ కింద గుంటూరుకు తీసుకెళ్లడం కోసం వారు వచ్చారు. ఇంతకూ ఈ కేసు కథమేటింటే..

2003లో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేత తదితరాలకు నిరసనగా మాజీ మంత్రి సోమిరెడ్డి నేతృత్వంలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసులు ఈ ముట్టడిని అడ్డుకునే క్రమంలో టీడీపీ నాయకులందరిని హౌస్ అరెస్టులు చేశారు. ఆ సందర్భంగా సోమిరెడ్డిని హౌస్ అరెస్టు చేసిన ఫొటోలను పోలీసులను కూడా ప్రెస్‌కు రిలీజ్ చేశారు. కాకాణి అనుచరులు సోమిరెడ్డి ఇంట్లో కూర్చుని ఉన్నట్లు పోలీసులు రిలీజ్ చేసిన ఫొటోలను తీసుకొని సోమిరెడ్డి పక్కన ఒక మందు గ్లాస్ పెట్టి మార్ఫింగ్ చేశారు. ఈ ఫొటోలను పెట్టి చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన సోమిరెడ్డి తెల్లవారేసరికల్లా మందు తాగుతూ ఇంట్లో కూర్చున్నాడు చూడండి అని కాకాణి అనుచరులు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన సోమిరెడ్డి తన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారని, తన వ్యక్తిత్వాన్ని హననం చేశారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గుంటూరులోని సీఐడీ రీజనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే అప్పట్లో వైసీపీ అధికారంలో ఉన్న కారణంగా ఫిర్యాదు తీసుకున్నారే కానీ కాకాణిపై కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సోమిరెడ్డి మళ్లీ తన ఫిర్యాదును తిరగదోడారు. దీంతో ఈ ఏడాది జనవరిలో సీఐడీ కార్యాలయం కాకాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పుడు కాకాణిని విచారించాల్సిన అవసరం ఏర్పడటంతో నెల్లూరుకు వచ్చింది. న్యాయస్థానం సమ్మతిస్తే మంగళవారం పీటీ వారెంట్‌పై కాకాణిని సీఐడీ అధికారులు గుంటూరుకు తీసుకెళ్లి విచారించే అవకాశం ఉంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఆరని జ్వాల

నెల్లూరులో సాక్షి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తెలుగు మహిళలు

జగన్ రోత పత్రికపై రెండోరోజు సోమవారం కూడా తెలుగు మహిళలు ఆందోళనలు నిర్వహించారు. నెల్లూరులోని సాక్షి కార్యాలయాన్ని తెలుగు మహిళలు ముట్టడించారు. కావలి, కొండాపురం, మనుబోలు ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.



అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కొట్టాలపల్లి, బీసీ కాలనీ, గన్నేపల్లి, సర్వంాబాదు గ్రామాల్లో ఊరేగించారు. ఊరూరా మహిళలకు కడవలతో నీరు పోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన స్థానికులు ఉత్సవాల సందర్భంగా గ్రామాలకు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు

స్టాంపు పేపర్లే ముద్దు

- కేంద్రం తీసుకురానున్న రిజిస్ట్రేషన్ ముసాయిదా బిల్లుకు వ్యతిరేకత
- పాత విధానమే మేలంటున్న ప్రజలు, దస్తావేజు లేఖర్లు

జెరాక్స్‌లు వద్దే వద్దు...

ఇటీవల జరిగిన సమావేశంలో దస్తావేజు లేఖరుల సంఘీభావం (ఫైల్)



నెల్లూరు (హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1908 రిజిస్ట్రేషన్ చట్టం అమలులో ఉంది. ఈ చట్టం ప్రకారం నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీద ఆస్తుల వివరాలు రాసి, రిజిస్ట్రేషన్లు చేసే విధానం అమలులో ఉంది. రిజిస్ట్రేషన్ చట్టం సమగ్రత, విశ్వసనీయతను నిలబెట్టడానికి వీలు కల్పిస్తూ, దేశవ్యాప్తంగా సురక్షితమైన సమర్థవంతమైన, పౌర కేంద్రీకృత రిజిస్ట్రేషన్ పద్ధతులను అమలు చేయడానికి 2025 రిజిస్ట్రేషన్ బిల్లు తయారు చేశారు. ఈ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలను ఈనెల 27వరకు కేంద్రం ఆహ్వానించింది. అయితే ఈ బిల్లులో ఆన్‌లైన్



పెన్‌డౌన్ సమ్మె చేస్తాం

కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న 2025 రిజిస్ట్రేషన్ చట్టంలో కాగితరహిత, వైట్ పేపర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. స్టాంపు పేపర్లు వినియోగించి దస్తావేజులు తయారు చేసుకునేలా చట్టంలో అవకాశం కల్పించాలి. లేక పోతే ఈనెల 28 నుంచి పెన్‌డౌన్ సమ్మెచేస్తాం.

- పట్నం దుర్గేష్‌బాబు, అధ్యక్షుడు, జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం

● స్టాంపులే అందం

భూములు, స్థలాల విలువలు రూ.లక్షలు, రూ.కోట్లు దాటి పోతోంది. ఆ ఆస్తుల వివరాలను నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీద రాసుకుంటే ఎంతో అందంగా ఉంటాయి. అవి ధృడమైన పేపర్లు కావటంతో ఏళ్ల తరబడి భద్రపరచుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. ఒక రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అవసరమవుతాయి. వందల సంవత్సరాల పాటు అవి భద్రంగా ఉండాలి. అందుకనే ప్రజలు కాని, దస్తావేజు లేఖర్లు కాని నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా జెరాక్సు పద్ధతిలో దస్తావేజులు జారీ చేయటంతో ప్రజల నుంచి తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సరఫరాల చేసింది. దస్తావేజులను స్టాంపు పేపర్ల మీద రాయడానికి కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వటంతో ప్రజలు ఎంతో సంతోషించారు. తాజాగా కేంద్రం నూతనంగా తెచ్చే రిజిస్ట్రేషన్ బిల్లులో కాగితరహిత, వైట్‌పేపరు దస్తావేజులకు అవకాశం కల్పించనుండటంతో ప్రజల్లో, దస్తావేజు లేఖర్లలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

కాగిత రహిత అంశంపై దస్తావేజు లేఖరులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

● 28 నుంచి పెన్‌డౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 2025 రిజిస్ట్రేషన్ చట్టం ముసాయిదాలోని కాగిత రహిత, వైట్‌పేపర్ విధానంపై దస్తావేజు లేఖర్లులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. దస్తావేజు లేఖరులంతా శనివారం రాజమండ్రిలో సమావేశమై స్టాంపు పేపర్లు వినియోగించి దస్తావేజులు రాసుకొనే విధానం అమలు చేయాలని, లేకపోతే ఈనెల 28 నుంచి పెన్‌డౌన్ సమ్మె చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్నీ దస్తావేజు లేఖరుల సంఘాలతో కలిసి లేఖరులంతా జేఏసీగా ఏర్పాటయ్యారు. నూతనంగా ఆమోదించే రిజిస్ట్రేషన్ బిల్లులో నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లను వినియోగించేలా చూడాలని వారు కోరారు. .



కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విధానంలో ఆధునిక సాంకేతికతను తీసుకురావటానికి 2025 రిజిస్ట్రేషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసింది. అయితే ఈ బిల్లుపై ఈ నెల 27వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఆధునిక ఆన్‌లైన్ పద్ధతిలో, జెరాక్సు పద్ధతిలో దస్తా వేజులు వస్తాయి. దీన్ని వ్యతిరేకిస్తూ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీదే దస్తావేజు రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ సమ్మె చేయడానికి సిద్ధమవుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగాలి

- ఎంపీ వేమిరెడ్డి
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం గర్వకారణమని, విద్యార్థులంతా అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాల ద్వారా విద్యనభ్యసించి టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన అంధ విద్యార్థులకు ఉన్నతికి వీపీఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విజయాలను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించడం మంచి పరిణామమని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనేందుకు ఇలాంటి కార్యక్రమాలే నిదర్శనమన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 పేరుతో రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబ తీసుకువస్తున్న సంస్కరణలు విద్యార్థుల భవిష్యత్ రూపురేఖలే అందంగా ఉండబోతున్నాయని తెలిపారు. ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి 2వేల స్టూడెంట్స్ కిట్స్‌ను అందచేయనున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టామని, కంప్యూటర్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు కూడా ఎంపిక చేసిన పాఠశాలల్లో సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 250 మంది, ఇంటర్‌లో 34 మంది కలిపి మొత్తం 284 మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున చెక్కు, మెడల్, సర్టిఫికెట్లను ప్రదానం చేసి తల్లి దండ్రులతో కలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, డీఈఓ బాలాజీరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ వరప్రసాద్ రావు, డీవీఈఓ మధుబాబు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పేదల అభ్యున్నతి

నెల్లూరు (హరనాథపురం) : ప్రపంచంలోనే ఎక్కడా లేని మోడల్ పీ-4 అని, ఈ విధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి బాటలు వేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమాలను సోమవారం అమరావతి సచివాలయం నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కలెక్టరేట్ నుంచి ఎంపీ వేమిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ రావు పాల్గొన్నారు. అనంతరం వేమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్‌ప్లాన్ సమర్థవంతంగా అమలు చేసి పేదరికాన్ని పారద్రోలడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించినట్లు చెప్పారు. మన జిల్లాలో అక్వారంగం అభివృద్ధికి పీ-4 విధానాన్ని జోడించి అభివృద్ధి చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



సింహ వాహనంపై చాముండేశ్వరి

ఇందుకూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భక్తులపాటిల కల్పవల్లిగా పేరొందిన గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారు సోమవారం రాత్రి సింహవాహనంపై కొలువుదీరి ఊరేగారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుక కను కనులారా వీక్షించేందుకు భక్తజనం భారాగా తరలివచ్చింది. కాగా, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, అవినాష్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా యోగాంధ్ర కార్యక్రమాలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో యోగా ర్యాలీలు ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని ముత్తుకూరు సెంటర్ నుంచి చిల్డ్రన్స్ పార్కు వరకు జిల్లాస్థాయి యోగా ర్యాలీని ఇన్చార్జి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే మెగా యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అలాగే ఉదయగిరి పాత రంగనాయకుల గుడి వద్ద, 16న పెంచలకోనలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, జడ్పీ సీఈఓ విద్యారమ, ఎస్ఈలు వెంకటరమణ, విజయన్, గంగాధర్, డ్వామా పీడీ గంగాభవాని, డీసీఓ గురప్ప, డీఎస్‌డీఓ యతిరాజ్, విద్యార్థులు, యోగా గురువులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీటీఎంగా షమీమ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆర్టీసీ నెల్లూరు రీజియన్ డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్‌గా షేక్ షమీమ్‌ను నియమిస్తూ ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జోన్ కార్యాలయంలో ఆపరేషన్స్, కమర్షియల్ విభాగంలో సీటీఎంగా ఉన్న షమీమ్ నెల్లూరు రీజియన్ ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎంగానూ పని చేస్తున్నారు. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో నెల్లూరు రీజియన్ సీటీఎంగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి రవికాంత్‌ను బదిలీ చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ. 108800
వెండి ఒక గ్రాము	రూ. 111.80

కోళ్ల వ్యర్థాల వాహనాలు పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు వద్ద కోళ్ల వ్యర్థాల వాహనం, దామరమడుగు, జొన్నవాడ మధ్యలోని పొర్లుకట్ట పరిసర ప్రాంతంలో మరో వాహనాన్ని సోమవారం స్వాధీనం చేసుకుని వ్యర్థాలను నిర్వీర్యం చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. తిరుపతి, చెన్నై, నెల్లూరు నుంచి బుచ్చి మండలంలోని జొన్నవాడ పొర్లుకట్ట మీదుగా ఆర్‌ఆర్ నగర్, పెనుబల్లి, శ్రీరంగరాజపురం, దామరమడుగు వరకు సరఫరా చేస్తున్నారు. అదే విధంగా బెంగళూరు నుంచి బుచ్చి టోల్‌గేట్ వైపు నుంచి పెనుబల్లి, దామరమడుగు మీదుగా పొర్లకట్టలమీదుగా కోళ్ల వ్యర్థాలను రవాణా చేసి చేపల గుంతల్లో చేపలకు మేతలుగా వేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ వాహనాలను పట్టుకున్నారు.

టీడీపీ నేత జన్మదిన వేడుకలు

కొడవలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నార్తురాజుపాలెంలో టీడీపీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిలో యోగాంధ్ర ర్యాలీ



బుచ్చిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరు సచివాలయం పరిధిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించి యోగాతో ప్రయోజనాలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. యోగాతో ఆరోగ్యం మానసిక వత్తిడి దూరమై మానసిక ప్రశాంతత ఉంటుందని 17వ వార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు దొడ్ల కోదండరామిరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, బీజేపీ నాయకుడు రామిశెట్టి మోహన్‌బాబు, కాసా శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి కామాక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో 576 మందికి ఉచిత విద్య

● తొలి విడత జాబితా విడుదల ● మలివిడత త్వరలో వెల్లడి

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ఉచిత విద్యకు తొలి విడత ప్రక్రియ పూర్తయింది. చట్ట ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్య అందించాలి. ఈ విధానంలో ప్రతి ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశాలు నిర్వహించి, ఎంపికైన విద్యార్థికి 8వ తరగతి వరకు ఉచిత విద్య అందించాలి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 19 నుంచి 26వతేదీ వరకు విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా జిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అన్ని అర్హతలు పరిశీలించిన అనంతరం తొలివిడతగా 576 మందికి అవకాశం కల్పిస్తూ జాబితాను విడుదల చేశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి వీరంతా ఆయా పాఠశాలల్లో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో విడత కూడా త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

● వేధిస్తున్న సాంకేతిక సమస్య

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు పలు సాంకేతిక సమస్యలు అడ్డంకి అవుతున్నాయి. స్థానికంగా నివాసం ఉంటున్నా కొంతమంది చిన్నారులు వేరే ప్రాంతాల్లో జన్మించడం, అక్కడే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ కావడంతో దరఖాస్తులు చాలావరకు తిరస్కరణకు గురయ్యాయి. అప్పటికే ఓ కుటుంబంలోని చిన్నారి చదువుతుంటే మరొకరికి అవకాశం ఉండడం లేదు. కిలోమీటర్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే చేరాలనే నిబంధన వర్తిస్తుంది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరే అవకాశం దక్కడం లేదు.

● ప్రభుత్వమే ఫీజు చెల్లింపు

పేద విద్యార్థుల కోసం ప్రైవేట్ పాఠశాలలకు ఆయా ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అర్బన్ పరిధిలో రూ.8వేలు, రూరల్ పరిధిలో రూ.7వేలు, ఏజెన్సీ పరిధిలో రూ.5 వేలు చెల్లిస్తుంది. అయితే ఈ చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాసంవత్సరం సగం, చివరి పరీక్షల సమయంలో ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. గత ఏడాది కూడా ఫీజులు వసూలు చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. బాధిత తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దీనిపై ఫిర్యాదులు సైతం చేశారు. ఈ ఏడాది ఆ పరిస్థితి తలెత్తకుండా చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

ఎట్టకేలకు పేరు మారింది !

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనుబోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను సోమవారం రైతుసేవాకేంద్రాలుగా మార్పుచేశారు. ప్రభుత్వం కేంద్రాలకు పేరు మార్చాలని జీవో ఇచ్చి, డబ్బులు ఇచ్చినా, బోర్డులు మార్చకపోవడంపై ఈనెల7న ఆంధ్రజ్యోతిలో 'ఇంకా అవే పేర్లు' పేరుతో కథనం ప్రచురించింది. దీంతో జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించారు. బోర్డులు మార్చాలని మనుబోలు వ్యవసాయాధికారికి సూచించారు. దీంతో వీరంపల్లి, మనుబోలు, అక్కంపేట తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఆర్‌బికేలను ఆర్‌ఎస్‌కేలుగా బోర్డులపై రాతలు మార్చారు.

పీ-4 విధానంతో పేదరిక నిర్మూలన



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా పీ-4తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, అభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపకల్పనకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే స్వర్ణాంధ్ర-2047ను అమలు చేయనున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయాలను అమరావతి సచివాలయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు విజన్-2020 ఏవిధంగా అమలు చేశారో ఆ తరహాలోనే నేడు 2047ను అమలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. 10 సూత్రాల ద్వారా సమగ్రాభివృద్ధి, పేదరిక రహిత సమాజం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రతువులో ఎంపీలు, ఎమ్మెల్యేలు భాగస్వాములను చేస్తున్నారన్నారు. సచివాలయం వద్దే ప్రజా సమస్యలు పరిష్కారానికి, ఆయా నియోజకవర్గాల ప్రజల అవసరాల మేరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్న సీఎం కలలను సాకారం చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, 5మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, నియోజకవర్గం యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు పాలల్గొన్నారు.

గ్రంథాలయ అధికారి బాధ్యతల స్వీకరణ

రాపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాపూరు గ్రంథాలయ అధికారిగా సోమవారం అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రంథాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాపూరు గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మండల ప్రజలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు అవగాహన

వెంకటాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంటలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు, మట్టి నమూనాలు సేకరణ గురించి అధికారులు రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ శ్రీనివాసులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లోకేష్, కెనరా బ్యాంకు కోఆర్డినేటర్ రవి శంకర్, శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న, మండల వ్యవసాయ అధికారి హరికరుణాకర్‌రెడ్డి, సర్పంచి పాముల రాములమ్మ, నేతలు కుంకాల శ్రీహరి, దొడ్ల అశోక్, శంకరయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గురుమూఢమి

ముత్తుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గురుమూఢమి బుధవారం ప్రారంభమవుతుందని ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్య శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుమూఢమిలో గృహారంభం, గృహప్రవేశం, ఉపనయనం, వివాహాది శుభకార్యాలకు, అక్షరాభ్యాసాలకు ఎలాంటి శుభ లగ్నాలు ఉండమన్నారు. జూలై 25 నుంచి శ్రావణమాసం వస్తుందని, అప్పటి నుంచి శుభముహూర్తాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గ్లోబల్ యూత్ సమ్మిట్‌లో పాల్గొనడం అభినందనీయం

వెంకటాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని ఎన్పోయా యూనివర్సిటీలో జరిగిన గ్లోబల్ యూత్ సమ్మిట్- 2025లో విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ బీ.యుగంధర్‌రెడ్డి పాల్గొనడం అభినందనీయమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ప్రశంసించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం ప్రత్యేకంగా ఆ వలంటీర్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ కళాశాలలోని బయో టెక్నాలజీ విభాగంలో యుగంధర్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ కోర్స్ చేస్తున్నాడని, ఎంతో చురుగ్గా ఉండే అతను ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా గ్లోబల్ యూత్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొన్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, తదితరులు పాల్గన్నారు.

యోగాంధ్ర అవగాహన ర్యాలీ



వెంకటాచలం : యోగాంధ్రపై అవగాహన ర్యాలీలో అధికారులు

వెంకటాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో సోమవారం ఎంపీడీవో కల్పన ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యం యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. నిరంతరం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

● **మనుబోలు :** యోగాంధ్రలో భాగంగా సోమవారం మనుబోలులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి దళితవాడ వరకు అధికారులు ర్యాలీ నిర్వహించి యోగాంధ్రపై అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండు సెంటర్‌లో మానవహా రం ఏర్పాటుచేసి యోగాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. తరువాత యోగాంధ్ర వలన ఉపయోగాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచు కంచి పద్మమ్మ, ఎంపీడీవో జలజాక్షి, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, కార్యదర్శులు గరుడయ్య, శ్రావణి, ఏపీవో రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాపూరు : యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు

● **రాపూరు :** యోగాంధ్ర కార్యక్ర మంలో భాగంగా రాపూరు మండల పరిషత్ అధికారి మారెళ్ల భవాని ఆధ్వర్యంలో సోమ వారం ర్యాలీ నిర్వహిం చారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి బాలాజీ కాంప్లెక్స్ మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ వాసు, పంచాయతీ కార్యదర్శి కవిత, ఏపీఎం రాధారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **సైదాపురం :** మండల కేంద్రంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగా సాధనతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ రోత మీడియాపై ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

మనుబోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జగన్ రోత మీడియాపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు కోరారు. సోమవారం ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పొన్నూరు రామకృష్ణయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల మాటాలకు వైసీపీ నాయకులు వత్తాసు పలకడం సరికాదన్నారు. అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జర్నలిస్టులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు మధునాయుడు, సాని వెంకటరమణయ్య, కిరణ్‌కుమార్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాజాగౌడ్, శివమ్మ, సౌజన్య, మస్తానమ్మ, పెంచలమ్మ, కానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

వెంకటాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తన లక్ష్యమని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కురిచెర్లపాడులో సోమవారం సాయంత్రం సతీమణి శృతిరెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. 'ఇంటింటికి సోమిరెడ్డి కుటుంబం' అనే కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి చేనేత కార్మికులతో కలిసి మగ్గాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తెలుసుకున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు.నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర స్ఫూర్తితోనే గ్రామాల్లో తాము పర్యటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చల్లా నాగార్జున్ రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, మేదరమెట్ల కోదండయ్యనాయుడు, గిరినాయుడు, శ్రీనివాసులు నాయుడు, గిరిబాబునాయుడు, పాపా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఎంపీడీవోకి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు గత 12 వారాలుగా కూలీలు చెల్లించకపోవడంతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కమిటీ నాయకుడు బట్టా పెద్దబ్బయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలని కోరుతూ సీపీఎం నాయకులు, ఉపాధి హామీ కూలీలు ఎంపీడీవో శ్రీహరిరెడ్డికి వినతిపత్రం అందజే శారు. వేసవిలో ఉపాధి హామీ కూలీ నగదు అందకపోవడంతో కష్టాలు పడుతున్నారని చె ప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు విజయకుమార్, పూనమల్లి జానకిరామయ్య, గండవరపు విజయకుమార్, పూనమల్లి మల్లికార్జునరావు, గండవరపు బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి షైనీ స్టార్ అవార్డులు

మనుబోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదవతరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులు సోమవారం జిల్లా విద్యాశాఖా కార్యాలయంలో షైనీ స్టార్ అవార్డులు అందుకున్నారు. ఇందులో ఆరుగురు ప్రభు త్వ పాఠశాల విద్యార్థులు, కాగా మనుబోలు సుశ్రుత ఇంగ్లీషు మీడియం స్కూ ల్‌కు చెందిన కే నాగవైష్ణవి కూడా అవార్డు అందుకుంది. ఒక్కో విద్యార్థికి రూ.20వేల నగదు, పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగవైష్ణవిని ఆ పాఠశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు అభినం దించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ముంగర విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎండి. ఫరీద్ పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న విద్యార్థినితో సుశ్రుత స్కూల్ యాజమాన్యం

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కొడవలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హె ల్మెట్ ధరించాలని ఎస్‌ఐ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కొడవలూరులో సోమవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ఉపాధి హామీ నిర్వీర్యానికి ప్రయత్నం'

ముత్తుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఆలోచనతో ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య ఆరోపించారు. సోమవారం ఎంపీడీవో నాగమణికి సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా కూలీలు చెల్లించడంలేదని, పని ప్రదేశంలో భద్రతా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.600 చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున మండల ప్రజానీకం పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి దుంపల ఏడుకొండలు, నాయకులు గడ్డం అంకయ్య, షేక్.మస్తాన్, నాగరాజు, శ్యాంప్రసాద్, ఇ మామ్ సాహెబ్, ఏడుకొండలు, దాసరి అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి వ్యవసాయ కూలీ మృతి



మస్తానయ్య మృతదేహం

మనుబోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూ రుకి చెందిన కొణతం మస్తానయ్య (40) సోమవారం వేకువన విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని దళితవాడకు చెందిన మస్తానయ్య వ్యవసాయకూలీ. 14 ఏళ్ల క్రితం అనారోగ్యంతో భార్య చనిపోయింది. దీంతో ఆయన కూలీ చేసుకుంటూ ఇద్దరు మగపిల్లలను పోషిస్తున్నాడు. ప్రతిరోజూ రాత్రి ఇద్దరు పిల్లలు టీవీ చూసేందుకు పక్కనే ఉన్న అమ్మమ్మ ఇంటికికాని, పెదమ్మ ఇంటికి కాని వెళ్లి అక్కడే నిద్రిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భోజనం చేశాక పెదమ్మ ఇంటికి వెళ్లారు. సోమవారం వేకువన ఇంటిబయట మస్తానయ్య చనిపోయి ఉండటాన్ని చూసిన స్థానికులు కేకలు వేయడంతో మస్తానయ్య కుమారులు పరుగున వచ్చారు. ఎడమచేతివేళ్ల మధ్య నల్లగా ఉండడాన్ని గమనించారు. రాత్రి సమయంలో బహిర్భూమికని వచ్చి, నిద్రమత్తులో పొరపాటున వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నట్లు కుమారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమార్టం కోసం మస్తానయ్య మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి, తండ్రిని పోగొట్టుకున్న ఆ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

రాపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణ సమీపంలోని మద్దెలమడుగు జంక్షన్ దగ్గర్లో ఆదివారం అర్ధరాత్రి అజయ్ నాయక్ (20) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ హరి చందన తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజయ్ మద్దెల మడుగు జంక్షన్ సమీపంలోని ఓ ధాబాలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ధాబా లో విధులు ముగించుకున్న అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెల్లా చెదురైన మృతదేహాన్ని సోమవారం గ్రామస్తులు చూసి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అజయ్ నాయక్‌గా గుర్తించారు. అజయ్‌కు వివాహమై ఒక కుమారుడున్నాడు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైనేజీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి):నగరంలోని బృందావనం యూనియన్ బ్యాంకు సమీపంలో డ్రైనేజీ కాలువలో మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. అనంతరం సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. 46వ డివిజన్ వీఆర్వో శివ ఫిర్యాదుతో ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

● భార్యకు స్వల్పగాయాలు



హజరత్‌రావు(ఫైల్)

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు మార్గంలో నాగిరెడ్డిపాలెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. పోలంపాడుకు చెందిన దామంచర్ల హజరత్‌రావు(49) కలిగిరిలో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కొంతమంది యువకులకు ఉపాధి కల్పిస్తున్నాడు. ఆదివారం తన భార్యతో కలిసి రావిపాడు నుంచి కలిగిరికి మోటార్‌సైకిల్‌పై వస్తూ నాగిరెడ్డిపాలెం సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న మరో బైక్‌ను ఢీకొ ట్టాడు. ఈ ఘటనలో హజరత్‌రావు రోడ్డుపై పడి తలకు తీవ్రగా యాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించగా అక్కడ మృతి చెందాడు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి ఒక కుమార్తె ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ వేధిస్తున్నాడని మహిళ ఆత్మహత్యాయత్నం

● సెల్ఫీ వీడియోలో ఆరోపణలు

చేజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి వేధిస్తున్నాడంటూ చేజర్ల మండలం ఆదురుపల్లికి చెందిన జమీలా అనే మహిళ సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించింది. సేకరించిన సమాచారం మేరకు.. ఆదురుపల్లికి చెందిన మక్బూల్ జాన్, జమీలా కుటుంబాల మధ్య ఇంటి విషయంలో కొంతకాలం గా వివాదం నడుస్తోంది. సోమవారం మక్బూల్ జాన్ వివాదాస్పద ఇంటిలోకి సామాన్లు తీసుకొని ప్రవేశించింది. ఈ విషయం తెలుసుకున్న జమీలా ఆత్మహత్యకు యత్నించింది. అంతకుముందు సెల్ఫీ వీడియో ద్వారా సీఐ ఆరోపణలు చేసింది. తన తల్లి పేరిట ఉన్న ఆ ఇల్లు తనదని, అయితే సంగం సీఐ ఆ ఇంటి తాళాలు పగలగొట్టి మక్బూల్ వాళ్లని ఇంటిలోకి పంపించాడని ఆరోపించింది. ఇంటి విషయమై ఎనిమిది నెలల నుంచి సీఐ చుట్టూ తిరిగినా తమకు న్యాయం చేయలేదని, తన చావుకు కారణం సీఐ వేమారెడ్డే అని సెల్ఫీ వీడియోలో పేర్కొంది. జమీలాను కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై చేజర్ల ఎస్‌ఐ తిరుమలరావుని సంప్రదించగా విచారిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో కారులో గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను సోమవారం వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐ కే. శ్రీనివాసరావు విలేకరులకు వెల్లడించారు. వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు ఈనెల 8 సాయంత్రం తల్పగిరి కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలోని ఖాళీ ప్లాట్‌లో ఉన్న కారులో పోలీసులు తనిఖీలు చేశారు. నాయుడుపేట మండలం కానూరు రాజుపాలెంకు చెందిన ఈతముక్కల సాయికిరణ్, తోటపల్లి గూడూరు మండలం సౌత్ ఆములూరుకి చెందిన మద్దిని దిలీప్, వెంకటగిరిలోని చింతలగుంట నెహ్రూనగర్‌కు చెందిన లేబాకు జనార్దన్ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయి, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో బుచ్చి-జొన్నవాడ మార్గంలోని పెట్రోలు బంకు పక్కనే ఉన్న సెంట్రల్ చానల్ కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానిక ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు బుచ్చి ఖాజానగర్‌కు చెందిన షాకీర్(40)గా గుర్తించినట్టు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. అతను మతిస్థిమితం తప్పడంతోపాటు మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

'సీపీఐ నేత నారాయణను విమర్శిస్తారా'

నెల్లూరు (వైద్యం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జనసేన, బీజేపీ నాయకులు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను విమర్శిస్తారా..? అని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పహల్గాంలో ఉగ్రదాడిపై పోరాటం చేస్తున్న సమయంలో కమ్యూనిస్టు నేతలు యుద్ధం ఇరువురికి మంచిది కాదని ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని నారాయణ చెబితే కమ్యూనిస్టులు దేశంలో ఉండకూడదని పాకిస్తాన్‌కు పోండని సోము వీర్రాజు ఎలా చెబుతారన్నారు. జనసేన నేత పవన్‌కళ్యాణ్ సినిమాల్లో ఎలా వేషాలో వేశాడో రాజకీయాలలో అలాంటి ధోరణే ఉందని ఆయన విమర్శించారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు సయ్యద్ సిరాజ్, అజీజ్ అహ్మద్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామా అంకయ్య

న్యూస్ బాక్స్

ఔరా.. ధృవకుమార్ !



పద్యాలు, శ్లోకాలు ఆలపిస్తున్న ధృవకుమార్‌రాజ్

నెల్లూరు (సాంస్కృతి కం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోటలో గల ఆదిశంకర ధ్యాన మందిరంలో జేష్ఠమాసం సందర్భంగా సోమవారం లలితా సహస్ర నామ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారి ధృవకుమార్‌రాజ్ అనర్గళంగా పద్యాలు, శ్లోకాలు, స్తోత్రాలను ఆలపించి, అందరి అభినందనలు పొందారు. ఈ కార్యక్రమాన్ని చక్రాల ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకామాక్షి, ఛాయా కుమారి, రాజేశ్వరి, రాధ, వల్లి నిర్మలకుమారి, భానుమతి, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నజీర్‌బాషాకు అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గీతా వైభవ్ ట్రస్టు ఏర్పాటు చేసి ఇంటింటికి భగవద్గీతను పంపిణీ చేస్తున్న నజీర్‌బాషాను సోమవారం బీజేపీ నాయకులు మిడతల రమేష్ అభినందించారు. మూలాపేటలోని రమేష్ ఇంటిలో నజీర్ బాషా భగవద్గీతను అందజేశారు. ప్రతీ భారతీయుడు భగవద్గీతను చదవాలని,తాను ఆ పుస్తకాన్ని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసభ్యంగా మాట్లాడిన వారిని అరెస్టు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 9(ఆంధ్రజ్యోతి) : అమరావతి మహిళలు, రైతుల గురించి సభ్యసమాజం తలవంచుకునేలా జగన్ రోత మీడియాలో చర్చ నిర్వహించటం, మహిళలను వేశ్యలు అనడం, ఘోరం, నేరమని భారత్ సేవాఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు కారణమైన మీడియా యాజమాన్యాన్ని, అసభ్యకర మాటలు మాట్లాడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లూరు (జడ్పీ), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం. శ్రీధర్ తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూమిలిటరీ కాలనీ, ఇందిరా గాంధీనగర్, చైతన్యపురి, సంజయ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించుకోవాలన్నారు.

22న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ఈనెల 22న ప్రతిభ పురస్కారాలు అందచేయనున్నట్లు నాయీబ్రాహ్మణ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు వేలూరు రంగారావు తెలిపారు. సోమవారం సాయంత్రం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నవాబుపేటలో గల మద్దులూరు వీరరాఘవయ్య నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో వీటిని ఆరోజు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ పురస్కారాలకు దరఖాస్తు ఫారాలను 94404 25241, 99633 24583 నెంబర్ల ద్వారా పొందాలని ఆయన తెలిపారు.

లా పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో సనాతన భరత్‌కు ఐదో ర్యాంకు



నెల్లూరు (విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ లా పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఫలితాల్లో నెల్లూరు శాంతినగర్‌లో నివాసం ఉండే సనాతన భరత్ ఐదో ర్యాంక్ సాధించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. సనాతన భరత్ లా నెట్ పరీక్షల్లో 2024లో జనరల్ కేటగిరిలో, సెట్ పరీక్షల్లో క్వాలిఫై అయ్యి ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఇయర్ అడ్వకేట్ ఆన్ రికార్డ్ శిక్షణలో ఉంటూ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. భవిష్యత్‌లో న్యాయ విజ్ఞానంపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తానని భరత్ తెలిపారు.

స్కూళ్ల అభివృద్ధికి చేయూతనివ్వాలి



కాలువలో పూడికతీతను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూన్9(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో పుట్టి బయట ప్రాంతాల్లో స్థిరపడినవారు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు ముందుకు రావాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని బాలాజీనగర్ మసీదు కూడలి వద్ద కాలువల్లో పూడిక తీతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు తీసుకువచ్చిన పీ4 కార్యక్రమానికి చేయూతనివ్వాలని తెలిపారు. నగరంలో వీఆర్సీ కాకుండా మరో నాలుగు పాఠశాలలు ఆధునికీకరణకు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. ప్రతీ డ్రైనేజీ కాలువలో పూడిక తీసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. వర్షాలు వస్తే నీళ్లు నిలవకుండా ఇప్పట్నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరులోపు పూడికతీత పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, ఎంహెచ్‌వో చైతన్య, టీడీపీ నాయకులు వీబీఆర్, మధు తదితరులు పాల్గొన్నారు.

వారంలో తల్లికి వందనం : కోటంరెడ్డి



పంచాయతీ భవన నిర్మాణ శంకుస్థాపనలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్9,(ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి మరో వారంలో తల్లికివందనం పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనాన్ని ప్రభుత్వం కల్పించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పొట్టేపాళెం, దేవరపాళెం, కొమ్మరపూడి, కొండ్లపూడి, ములుముడి గ్రామాల్లో చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికపరమైన కష్టాలు రాష్ట్రాన్ని వెంటాడుతున్నప్పటికీ ఇచ్చిన మాటకోసం ప్రజల అవసరాలను తీర్చేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. చంద్రన్న పల్లెపండుగ ద్వారా 18 గ్రామాల్లో రూ. 11 కోట్లతో నిర్మించిన పనులను ప్రజలకు అంకితం చేశామన్నారు. పొట్టేపాళెంలో రూ. 28 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, అచ్యుతశంకర్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, పులి రాంగోపాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కి 79 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు(సిటీ), జూన్9,(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 79 మంది తమ సమస్యలను చెప్పుకున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణం, డ్రైనేజీ, సిటీప్లానింగ్, పారిశుధ్యం తదితర అంశాలపై నగరవాసులు కమిషనర్ నందన్‌కు వినతులు అందించారు. తక్షణం వినతులపై స్పందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. 47వ డివిజన్‌లోని పాత డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయాలని టీడీపీ నాయకుడు ధర్మవరపు సుబ్బారావు కమిషనర్‌కి విజ్ఞప్తి చేశారు. కాగా స్వర్ణాంధ్ర విజన్ 2047 పై సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు (వైద్యం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 4వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, రూరల్ కార్యదర్శి పెంచలనర్సయ్య మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి తక్కువగా ఉందని, కొందమంది కార్మికులను తొలగించి కేంద్ర మెండివైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కొండా ప్రసాద్, అల్లాడి గోపాల్, నరసింహరెడ్డి, సుధాకర్, కోటేశ్వరరావు, సురేష్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో
నారాయణకు ఉత్తమ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈఏసీ సెట్‌లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వీ.విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని నారాయణ ఐఐటీ అకాడమీలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ఐఐటీ అకాడమీ విద్యార్థులు కె. పూర్వజ్ 84వ ర్యాంక్, ఎం.హేమంత్‌సాయి 90వ ర్యాంకు, కె.అశ్రిత 105వ ర్యాంక్, ఎం.మధుకిరణ్‌రెడ్డి 135వ ర్యాంక్, జి.హితేష్ అభిషేక్ 242వ ర్యాంక్, జి.సాయిసాత్విక్ 291వ ర్యాంక్, బి.భానురిషిక్ 302వ ర్యాంక్, కృష్ణకౌశిక్ 450వ ర్యాంక్, కె.హర్షవర్ధన్ 492వ ర్యాంక్ సాధించారన్నారు. వీరితో పాటు వందలోపు ఇద్దరు, 500 లోపు 9 మంది, వెయ్యిలోపు 14 మంది, 2వేల లోపు 33 మంది, 3వేల లోపు 50 మంది, 5వేల లోపు 95 మంది, పదివేల లోపు 208 మంది, 20వేల లోపు 480 మంది, 30వేల లోపు 716 మంది, 50వేల లోపు 1162 మంది ర్యాంకులు సాధించారన్నారు. అందరి సమష్టి కృషితోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధి జయకుమార్‌రాయుడు, కోర్ డీన్‌లు, డీన్‌లు, డీజీఎంలు, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ ముక్త్ భారత్ లక్ష్యంగా కృషి

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి నయం చేయడంతో టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం పెరమన గ్రామంలో 104 (ఎఫ్‌డీపీ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్తభారత్ (ముందుగానే టీబీని గుర్తించడం) గురించి వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. 60 ఏళ్ల పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమ, మద్యపాన అలవాటు ఉన్న వారికి క్షయ పరీక్షలు చేయాలని సూచించారు. త్వరలో మొబైల్ ఎక్స్‌రే వాహనం అందుబాటులోకి వస్తుందని, ప్రతి గ్రామంలో అనుమానితులకు ఎక్స్‌రే తీస్తారని చెప్పారు.

ఆరోగ్యానికి యోగా కీలకం





యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఎస్ఈ విజయన్, 29, 36వ డివిజన్లలో యోగాంధ్ర ర్యాలీలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి యోగా ఎంతో కీలకమని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవానికి మద్దతుగా ఆయన చిల్డ్రన్ పార్కు ప్రాంతంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖలోని ఉద్యోగులంతా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే ప్రజలందరూ యోగాను చేయడం ద్వారా, అనేక వ్యాధులను నివారించుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగాకు, వయసుతో నిమిత్తం లేకుండా కొంత సమయం కేటాయించుకోవాలన్నారు. యోగా శిక్షణా కేంద్రాల్లో ముందుగా అవగాహన పొందితే ఆ తరువాత ఇళ్లలోనే చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే ప్రజలంతా ఈనెల 21న జరిగే యోగా దినోత్సవంలో భాగస్వాములై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దతుగా నిలవాలని కోరారు.

● యోగాపై అవగాహన ర్యాలీలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సోమవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సచివాలయ సిబ్బంది ఆయా డివిజన్లలో యోగాపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 29వ డివిజన్ గాంధీనగర్ సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గుద్దేటి చెంచయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్ కనపర్తి గంగాధర్, మైనార్టీ అధ్యక్షులు అల్లాం, జిలానీ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

● 36వ డివిజన్‌లో

నగరంలోని 36వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు షేక్.రసూల్ ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ పత్తేఖాన్‌పేట రైతు బజార్ నుంచి ప్రారంభమై, డివిజన్‌లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో చెంగలపట్టు శేఖర్, తంజావూరు మల్లికార్జున్, బాపనపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం




శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాజీ సెంటర్‌లోని శివాజీ విగ్రహం వద్ద సోమవారం హిందూ సామ్రాజ్య దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శివాజీ మిత్రమండలి, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ కమిటీ, మరాఠా మిత్రమండలి, హిందూ చైతన్య వేదిక సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నేత పీ.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీ సుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్, మహేష్, కుమార్, మధుసూదన్, బాలసుబ్రహ్మణ్యం, సూరి తదితరులు పాల్గొన్నారు.

● ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా నగరంలోని శివాజీ విగ్రహానికి సోమవారం ఆర్ఎస్ఎస్ శ్రీకృష్ణదేవరాయశాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు గుర్రం సుధాకర్ మాట్లాడుతూ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ రాజుగా పట్టాభిక్తుడైన రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్,దాని అనుబంధ సంస్థల నాయకులు పీ. హరి, మారుతి రవికృష్ణ, జీ. రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కోటమిట్టలో చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని కోటమిట్ట డైకాస్‌రోడ్డు ప్రాంతంలో షేక్ నజీర్ అహ్మద్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈనెల 8న నజీర్ అహ్మద్ భార్య పిల్లలను తీసుకొని కోటమిట్టలోని ఖత్రీజా మసీదు వద్ద ఉన్న అత్తవారి ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే నిద్రించింది. సోమవారం ఉదయం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని నాలుగు జతల వెండి పట్టీలు, రెండు వెండి గ్లాసులు, రూ.22 వేల నగదు కన్పించలేదు. ఈ మేరకు నజీర్ అహ్మద్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్



పట్టుబడిన మైనర్ల బైకులు

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దర్గామిట్ట పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ రోశయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మైనర్లకు డ్రైవింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో పలువురు మైనర్లు వాహనాలు నడుపుతుండగా వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో మైనర్లకు సీఐ రోశయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఏ సీఎంకి రాని ఆలోచన ఎన్టీఆర్‌కి వచ్చింది

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



పుస్తకావిష్కరణలో నేతలతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఏ సీఎంకి రాని ఆలోచన ఎన్టీఆర్‌కు వచ్చిందని, అదే పక్కాఇళ్ల నిర్మాణమేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ నగరంలో సోమవారం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో మంచి పనులు చేసిన నేత ఆయనేనని, ఆయన నాయకత్వంలో పనిచేసినందుకు ఎంతో సంతోషపడుతున్నానని తెలియచేశారు. యువగళం పాదయాత్రతో లోకేష్ రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించి ఎన్టీఆర్ కుటుంబంలో మూడవ తరం హీరోగా నిలిచారన్నారు. తెలంగాణాలోనూ వచ్చే ఎన్నికలలో కూటమి అధికారంలోకి రావటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తారక రామ పుస్తకాన్ని స్థానిక నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

అఖిల భారత్ చెస్ పోటీల విజేత శైలేష్



విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఎస్వీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నక్షత్ర స్కూల్‌లో జరుగుతున్న అఖిల భారత చెస్ పోటీల్లో తమిళనాడుకు చెందిన రేటింగ్ క్రీడాకారుడు ఆర్. శైలేష్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే తెలంగాణాకు చెందిన పి.రామకృష్ణ ద్వితీయస్థానం, తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం తృతీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వైసుమన్ నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు, వివిధ వయో విభాగాల నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ సిహెచ్.సందీప్‌రెడ్డి, జీవన్‌కృష్ణ, టోర్నీ నిర్వాహకులు వంశీకృష్ణ, సుధాశ్రీ, సుశీల, చీఫ్ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించాలి

● డీఈవో కార్యాలయం ఎదుట టీచర్ల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ కౌన్సెలింగ్ మాన్యువల్‌గానే నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని డీఈవో ఎదుట సోమవారం ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోకుండా మేము ఎవరి మాట వినం, వెబ్ కౌన్సెలింగ్‌ను మాత్రమే నిర్వహిస్తామని కమిషనర్ చెప్పడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. తాము కూడా అందరం ఒక్క మాటపై నా తమ సమస్యను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఉపాధ్యాయులు ఇబ్బందులు పట్టించుకోకుండా బలవంతంగా తమను బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెబ్ కౌన్సెలింగ్‌ను అంగీకరించమని మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించే వరకు నిరసనలు చేపడుతుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎ.సురేంద్రరెడ్డి, నేతలు అనిల్, చలపతిశర్మ, నరసింహులు, హజరత్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రావు, శివశంకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళా క్రికెట్

ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏప క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసులరెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.



పోటీల ప్రారంభోత్సవంలో ఎన్‌డీసీఏ ప్రతినిధులు, క్రీడాకారిణులు



కోన హుండీల ఆదాయం రూ.88 లక్షలు

రాపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఆలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. స్వామి వారి, అమ్మవారి, ఆంజనేయ స్వామి వారి ఆలయాల ముందు ఉన్న హుండీలు లెక్కించగా, గత 34 రోజులకుగాను రూ.88,44,153 రాబడి వచ్చింది. దీనితో పాటు 103 గ్రాముల బంగారం, 4.02 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ నోట్లు ఉన్నాయి. ఈ హుండీల లెక్కింపును దేవదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్ కుమార్ పర్యవేక్షించారు. రాబడిని పెంచలకోన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

● వెంగమాంబ హుండీలతో రూ.12 లక్షలు

దుత్తలూరు(ఉదయగిరి) : నర్రవాడ వెంగ మాంబ పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో నెల్లూరు శ్రీహరిహరనాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి యూ జానకమ్మ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఈ ఏడాది మే 13 నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.12,10,630 రాబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో నర్రవాడ ఏపీజీబీ సిబ్బంది, విశ్రాంత ఎస్‌బీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్'లెస్'!

- ● బడిబస్సుల కండీషన్ బాగుందా!?
- ● ఎఫ్‌సీకి దూరంగా విద్యాసంస్థల వాహనాలు
- ● స్పెషల్ డ్రైవ్‌కు అధికారుల సన్నద్ధం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ కిటికీలకు గ్రిల్స్ ఉండవు.. పుస్తకాలు పెట్టుకునే అమరికలూ అంతంతే.. అసలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతామా!? లేదా అన్న అనుమానం. ఇవీ విద్యాసంస్థలకు పిల్లలను తీసుకువెళ్లే వాహనాల దుస్థితి. విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో పదుల సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఇంటర్ కళాశాలలు ప్రారంభం కావడం, ఈ నెల 12 నుంచి స్కూళ్ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం ఫిట్‌నెస్ లేని వాహనాలలో పిల్లల్ని తరలించేందుకు సిద్ధమవుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడనుంది.

● నిబంధనలు ఇలా...

విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థల బస్సులకు అనేక నిబంధనలు ఉన్నాయి. మోటారు వాహనాలు-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మోటారు వాహనాల చట్టం 1989, రూల్ 185, జీవో నెంబరు 35లో మార్పులు చేర్పులు చేసిన తర్వాత విద్యాసంస్థల బస్సులకు అనేక నింబధన లు అమల్లోకి వచ్చాయి. ఈ నిబంధనలు పాటించిన వాహనాలకే రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు.

- బస్సు డ్రైవర్ వయసు 60 సంవత్సరాలు మించి ఉండకూడదు. డ్రైవర్‌కు హెల్త్‌కార్డును నిర్వహించాలి. ప్రతి మూడు నెలలకు విద్యాసంస్థల యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్‌కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులో పొందుపరచాలి.
- డ్రైవింగ్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. డ్రైవర్ నియామకం గురించి పేరెంట్స్ కమిటీకి తెలపాలి.
- వాహనం కండీషన్ తెలుసుకునేందుకు బస్సుకు సంబంధించిన బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, లైటింగ్ వంటి వాటి మెకానికల్ కండీషన్, పని తీరును నెలకొకసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ బస్సును తనిఖీ చేయాలి.
- ప్రతి వాహనంలో అవసరమైన మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి.
- బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి అందుబాటులో ఉండాలి.
- పిల్లల బ్యాగులను ఉంచుకొనేందుకు సీట్ల కింద అరలు ఏర్పాటు చేయాలి.
- పరిమితికి మించి పిల్లల్ని బస్సులో ఎక్కించకూడదు. డ్రైవర్‌తోపాటు సహాయకుడు తప్పనిసరిగా ఉండాలి.
- బస్సులో అక్కడక్కడ నిలువు స్తంభాలను ఏర్పాటు చేయాలి. ఇలా 32 నిబంధనలు విద్యాసంస్థల బస్సులు పాటించాల్సి ఉంటుంది.

● ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్న బస్సులెన్నో..

జిల్లాలోని నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు ఆర్టీవో కార్యాలయాల పరిధిలో 1,130లకుపైగా విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ అధికారులు మంజూరు చేస్తారు. నిబంధలన్నీ పక్కాగా ఉంటేనే సర్టిఫికెట్ అందజేస్తారు. అయితే, జిల్లాలో వందలాది బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్నట్లు సమాచారం.

స్పెషల్ డ్రైవ్ చేస్తాం!



విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న సమయం లో ఆ సంస్థలకు చెందిన ప్రతి బస్సు ఫిట్‌నెస్‌తో ఉండాలి. అలాలేని బస్సులను సీజ్ చేయడం, ఆ విద్యాసంస్థలపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత విద్యాసంస్థల బస్సులపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తాము. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాము.

\- బి చందర్, డీటీసీ

సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సరెండర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో సూపరిం టెండెంట్‌గా పనిచేస్తున్న వైలూకాస్‌ను సరెండర్ చేయాలని సోషల్ వెల్ఫేర్ డైరె క్టర్ లావణ్యవేణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిలోని సోషల్ వెల్ఫే ర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆమె ఆదేశించారు. ఇటీవల సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ బదిలీలలో జరిగిన అక్ర మాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల కు స్పందించిన డైరెక్టర్ ఆయన్ను సరెండ ర్ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

బీసీ సంక్షేమంలో బదిలీలు

- ● 15 మంది హెచ్‌డబ్ల్యూవోల బదిలీ
- ● ఉత్తర్వులు జారీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్

నెల్లూరు (హరనాథపు రం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, దిగువ స్థాయి ఉద్యోగుల బదిలీల ఫైల్‌కు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ సోమవారం రాత్రి ఆమోదం తెలిపారు. ఈ శాఖలో 15 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, 49 మంది క్లాస్ ఫోర్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఫైల్ డీఆర్‌ఓ ఉదయభాస్కర్ రావు పరిశీలించాక ఇన్‌చార్జి కలెక్టర్ వద్దకు సోమవారం చేరింది. ఫైల్‌లో పేర్కొన్న వారి బదిలీలు, నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో పరిశీలించి ఆమోదం తెలిపారు. అయితే వెంకటగిరి బీసీ సంక్షేమ కాలేజీ హాస్టల్‌లో పని చేస్తున్న ప్రవల్లిక అనే హాస్టల్ సంక్షేమాధికారి నెల్లూరుకు బదిలీ చేయించుకోడానికి ప్రయత్నించారు. అక్కడ ఆమె ఐదేళ్ల పనిచేయటంతో తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. దీంతో ప్రవల్లిక జిల్లా బీసీ సంక్షేమాధికారిని కలిసి తనను నెల్లూరులోని ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో హెచ్‌డబ్ల్యూగా నియమించాలని కోరిన ట్లు స మాచారం. కాలేజీ హాస్టల్ హెచ్‌డబ్ల్యూను ప్రీమెట్రిక్ హాస్టల్‌లో నియమించడానికి నిబంధనలు ఒప్పుకోవని ప్రవల్లికకు చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లగా నెల్లూరులో ఖాళీ లేనందున వెంకటగిరి పక్కనే ఉన్న బంగారుపేట బాలికల ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ప్రవల్లికను ఇన్‌చార్జి హెచ్‌డబ్ల్యూగా నియమించారు. తదుపరి బదిలీల్లో ప్రవల్లికకు స్థానచలనం కల్పించను న్నట్లు తెలిసింది.



బదిలీ ఉత్తర్వులు అందచేస్తున్న బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి

సూపరింటెండెంట్ బదిలీ

బీసీ సంక్షేమశాఖ జిల్లా ప్రధాన కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.శాంసన్‌ను గుంటూరు జిల్లా బీసీ సం క్షేమశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ను బదిలీ చేశారు.

అర్జీలకు త్వరగా పరిష్కారం చూపండి

● డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సమర్పించే అర్జీలకు త్వరగా మెరుగైన పరిష్కారం చూపాలని డీఆర్వో ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడారు. నిర్దిష్ట గడువు లోగా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

● మొత్తం 383 వినతులు

ఈ కార్యక్రమంలో అర్జీదారులు 383 వినతులను అధికారులకు అందచేశారు. వీటిలో రెవెన్యూవి 132 అర్జీలు, మున్సిపాలిటీవి 35, సర్వేవి 28, పంచాయతీరాజ్‌శాఖవి 34, పోలీసుశాఖవి 63, సవిల్ సప్లయిస్‌కి సంబంధించిన 16 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌రెడ్డి, సర్వేశాఖ ఏడీ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు సమస్యలు మొరపెట్టుకుంటున్న కలువాయి ప్రజలు

● కుల ధ్రువీకరణ రద్దు చేయాలి

హిందూమతం నుంచి క్రైస్తవమతంలోకి మారిన రేవూరి యానాదయ్యకు ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణపత్రాన్ని రద్దు చేయాలని కలువాయి గ్రామ వాసులు డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలువాయికి చెందిన రేవూరు యానాదయ్య ఎస్సీ వర్గానికి చెందినవాడని చెప్పారు. క్రైస్తవమ తంలోకి మారి, చర్చికి పోతున్నాడని వివరించారు. కావున విచారణ జరిపి ఆయనకు ఇచ్చిన ఎస్సీ కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని వారు కోరారు.

బినామీ మస్టర్లపై విజిలెన్స్ విచారణ

● ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం ● పోలీసుల జోక్యం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లపై సోమవారం జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఉదయగిరి ఏపీడీ మృదుల విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు, కూలీలతో కలిసి పోలీసుల సమక్షంలో బహిరంగ విచారణ నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నర్రవాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లు అధికంగా నమోదువుతున్నాయని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టామని చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గ్రామంలోని లేనివారు.. ఇలా 60 మందితో బినామీ మస్టర్లు వేశారని ఫిర్యాదు చేశారన్నారు. విచారణకు కొందరు కూలీలు హాజరు కాగా, మరికొందరు అందుబాటులో లేరన్నారు. విచారణకు హాజరైన కూలీలు పనులకు వెళుతున్నారా, లేదా అని విచారించి చేసి సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. విచారణకు హాజరు కాని వారి వద్ద నుంచి సంతకాలు సేకరించాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. మస్టర్ల ఆన్‌లైన్ విచారణ సైతం చేపట్టి కలెక్టర్‌కు తుది నివేదిక అందజేస్తామన్నారు. కాగా, విచారణ సమయంలో పంచాయతీకి చెందిన ఇరువర్గాల మధ్య పలుమార్లు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. పోలీసులు కలుగజేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో బ్రహ్మయ్య, సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న విజిలెన్స్ అధికారులు

ఇరువర్గాలకు సర్ది చెబుతున్న పోలీసులు

ప్రేమజంటపై యువతి బంధువుల దాడి

● అడ్డుకున్న స్థానికులు, పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంటపై యువతి బంధువులు దాడి చేసిన ఘటన కలిగిరిలో సోమవారం జరిగింది. వివరాల మేరకు.. నెల్లూరులోని వీఆర్ లా కాలేజీలో చదువుతున్న ఓ యువతి, యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ యువతికి కుటుంబ సభ్యులు వేరొకరితో వివాహ ప్రయత్నాలు ప్రారంభించగా ప్రేమికులు భైరవకోనలో వివాహం చేసుకుని నెల్లూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. కలిగిరి హైస్కూల్ సమీపంలో కారు నిలిపి టీ తాగేందుకు కారు దిగగా గుర్తించిన యువతి బంధువులు ఆ యువతిని బలవంతంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీనిని ఆ యువకుడు అడ్డుకోవడంతో అతనిపై దాడి చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో యువతి బంధువులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రేమ జంటను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'సాక్షి' కార్యాలయం ముట్టడి

నెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సాక్షి చానెల్‌లో అమరావతి రాజధానిపై దుష్ప్రచారం చేస్తూ మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినందుకు టీడీపీ మహిళా విభాగం చేపట్టిన ఆందోళనలు వరుసగా రెండో రోజు సోమవారం కొనసాగాయి. తొలిరోజు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించగా, రెండో రోజు జాతీయ రహదారి మీదనున్న సాక్షి కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు సర్దిచెప్పడంతో తెలుగు మహిళలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'మన స్వాక్షి లేని సాక్షిపై కేసు నమోదు చేయాలి' అంటూ డిమాండ్ చేశారు. తల్లి వంటి మహిళలను కించపరుస్తూ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అనంతరం సాక్షి పేపర్లను తగలబెట్టారు. ఈ నిరసనలో తెలుగు మహిళా విభాగం నెల్లూరు నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి, అంచూరు జానకి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ఎస్‌లో జామాయిల్ కర్ర మాయం

- ● రహస్యంగా తరలించి సొమ్ము చేసుకున్న ఎఫ్‌బీవో
- ● ఎఫ్ఆర్‌వోకు వీఎస్ఎస్ సభ్యుల ఫిర్యాదు.. విచారణ

ఉదయగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అటవీ శాఖలో అవినీతి షరా మామూలై పోయింది. వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను వనసంరక్షణ సమితుల(వీఎస్ఎస్) పేరుతో తూతూమంత్రంగా చేసి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. తాజాగా వీఎస్ఎస్‌లో నరికిన జామాయిల్ కర్రను గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. జిల్లాలో గత కొన్ని నెలలుగా వీఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్రను టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కూలీల చేత నరికిస్తున్నాడు. ఉదయగిరి మండలం శకునాలపల్లి బీట్ పరిధిలోని వీఎస్ఎస్‌లో జామాయిల్ కర్రను నరికి లారీల్లో తరలించగా కొంత కర్రను అక్కడే వదిలేశారు. దానిని అటవీ శాఖలోని ఓ అధికారి గుట్టుచప్పుడు కాకుండా రాత్రికిరాత్రే ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి కడప జిల్లా బద్వేల్ సమీపంలో ఉన్న పరిశ్రమకు తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న వీఎస్ఎస్ వైస్ చైర్మన్, సభ్యులు శనివారం ఉదయగిరి రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజాను కలిసి ఎఫ్‌బీవోపై ఫిర్యాదు చేశారు. దీంతో రేంజ్ అధికారి వీఎస్ఎస్ వైస్ చైర్మన్, సభ్యులు, కర్రను తరలించిన ట్రాక్టర్ వ్యక్తిని కార్యాలయానికి సోమవారం పిలిపించి దుత్తలూరు డీఆర్వో మురళీ, ఉదయగిరి ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్యల ద్వారా నివేదిక నమోదు చేయించారు. ఒక ట్రాక్టరు కర్రను తరలించినట్లు అధికారులు చెబుతుండగా స్థానికులు మాత్రం కొన్ని ట్రాక్టర్ల కర్ర అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను వివరణ కోరగా వీఎస్ఎస్ సభ్యులు ఒక లోడ్ జామాయిల్ తరలించారని ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంపై సభ్యుల స్టేట్‌మెంట్ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

వినతుల్లో ఎన్నో వేదనలు, వెతలు!

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 88 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమ వారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా వ్యాప్తంగా 88 మంది అర్జీదారులు తరలివచ్చి వారి సమస్యలను ఎస్పీతోపాటు ఇతర పోలీసు అధికారులకు విన్నవిం చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

- ఉలవపాడుకి చెందిన ఓ మహిళను నాయుడుపేటకి చెందిన సైఫుల్లాఖాన్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తన తండ్రి బ్రెయిన్ డెడ్ అయి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని సైఫుల్లాఖాన్ చెప్పి ఆ మహిళ కుటుంబ సభ్యుల వద్ద నుంచి రూ.18 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించాడు. అంతేకాక అతడితోపాటు అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది.
- పొదుపు గ్రూపులో ఉన్న వీవోఏ సునీత పాత కక్షలు మనసులో పెట్టుకొని, తన అనుచరులతో దాడి చేయించిందని, ఆ దాడిలో తీవ్రగాయాలు అయ్యాయని టీపీ గూడూరుకి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితులపై చిన్న కేసు నమోదు చేశారని, దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరింది.
- నవాబుపేటకి చెందిన అన్వేష్ మైక్రో ల్యాండ్ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వేదాయపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.70 లక్షలు తీసుకొని మోసం చేశాడు. న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- వలేటివారిపాలెంకి చెందిన ఇద్దరు వ్యక్తులకు చెందిన రూ.5 లక్షల విలువచేసే గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని, న్యాయం చేయాలని బాధితులు కోరారు.
- జలదంకికి చెందిన ఓ వృద్ధుడు (70) తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, కుమారుడు, భార్య పట్టించుకోకుండా ఇళ్లు, పొలాలను ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశాడు.
- కావలి రూరల్ పరిధికి చెందిన ఓ మహిళ కుమార్తె మే నుంచి కన్పించడం లేదని, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరింది.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

బంగారం, వెండి ధరలు	
బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ. 108800
వెండి ఒక గ్రాము	రూ. 111.80



పాఠ్య పుస్తకాలు సిద్ధం

మల్లయ్య, ఎంఈవో - 2, సంగం

ముఖాముఖి

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందచేసేందుకు ఇప్పటికే పాఠశాలల్లో సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో -2 బి మల్లయ్య తెలిపారు. పలు అంశాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

? మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఎంత మంది ఉన్నారు.

! మండలంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలు (బీపీఎస్) 18, మోడల్ ప్రైమరీ స్కూల్స్ (ఎంపీఎస్) 14, ఫౌండేషన్ స్కూల్స్ (ఎఫ్ఎస్) 16 కలిపి మొత్తం 48 పాఠశాలలున్నాయి. ఇవికాకుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకటి, బాలికల గురుకుల పాఠశాల ఒకటి, ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 3987 మంది విద్యార్థులు 1 నుంచి 10 తరగతి వరకు చదువుతున్నారు.

? అందరికీ సరిపడ పాఠ్య పుస్తకాలు వచ్చా యా. వాటిని ఎక్కడ భద్రపరిచారు.

! మండలంలోని 3987 మంది విద్యార్థులకు సరిపడ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు వచ్చాయి. గత విద్యా సంవత్సరం హాజరు ప్రకారం అన్నీ పాఠశాలలకు సామగ్రి చేర్చాము.

? యూనిఫాం వచ్చిందా.

! యూనిఫాం, షూస్ రాలేదు, త్వరలో వస్తాయి. యూనిఫాం క్లాత్ వస్తుంది. విద్యార్థులే వారి సైజుకు తగ్గట్లు కుట్టించుకుంటే ప్రభుత్వం కుట్టు కూలి ఇస్తుంది.

? మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.

! మండలంలో ఎనిమిది ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

? బీపీఎస్, ఎంపీఎస్, ఎఫ్ఎస్ పాఠశాలుగా వర్గీకరణ వల్ల మండలంలో టీచర్ పోస్టులు పెరిగాయా, తగ్గాయా.

! పంచాయతీకి ఒక మోడల్ప్రైమరీ స్కూల్ వల్ల 16 పోస్టులు పెరిగాయి. దీని వల్ల 16 ఉపాధ్యాయ పోస్టుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న డీఎస్సీలో కొత్త పోస్టులు కేటాయిస్తారు.

శుక వాహనంపై కోటేశ్వరుడు

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అర్ధరాత్రి స్వామివారు శుక(చిలుక)వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గంగా, పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింట భక్తులు కర్పూర హారతులిచ్చారు. రజక సంఘం వారు కార్యకర్తలుగా వ్యవహరించారు.





యాళి వాహనంపై ఆత్మారామస్వామి

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో వెలసి ఉన్న ఆత్మారామ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అర్ధరాత్రి యాళి వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అలంకరణతో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను నివారించండి



మాట్లాడుతున్న మాజీ సర్పంచి మాదాల తిమ్మయ్య

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను, కంప కర్ర చెట్ల నరికివేతను నివారించాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నర్రవాడ పంచాయతీ పరిధిలోని 322, 366, ఉదయగిరి మండలం అప్పసముద్రం సమీపాన గల 133/2 సర్వేనెంబర్లలో కొందరు గ్రామస్తులు యథేచ్ఛగా తెల్లరాయి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. చెరువులు, మేతపోరంబోకు భూముల్లో ఉన్న కంకకర్ర చెట్లను సైతం తెగనరికి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ అక్రమ దందాపై ఎవరైనా గ్రామస్తులు ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇలారి నాగయ్య, మాజీ సర్పంచ్ మాదాల తిమ్మయ్య, టీడీపీ నాయకులు గోగినేని రామచంద్ర, మాదాల తిమ్మయ్య చౌదరి, జగన్, తిమ్మయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- టీడీపీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు చంద్రారెడ్డి
- ఉదయగిరి, ఆత్మకూరులో 'యోగాంధ్ర' ర్యాలీలు



ఆత్మకూరులో ర్యాలీలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ఆత్మకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని టీడీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి కొనసాగింది. వారు మాట్లా డుతూ కులమతాలకతీతంగా అందరినీ కలిపే శక్తి యోగాకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, ఆర్ఐ షేక్ షాజహాన్, మెప్మా సీఈవో మాధవి తదితరులు పాల్గొన్నారు.

● చేజర్లలో ర్యాలీ..

చేజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం చేజర్ల ఎంపీడీవో కార్యాలయంలో యోగాపై అవగాహన సద స్సు నిర్వహించారు. ఆ తర్వాత బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఎంపీడీవో ఎస్ వసుంధరాదేవి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నాయని చెప్పారు. ఎంత డబ్బు, హోదా ఉన్నా ఆరోగ్యం లేకపోతే వృథా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దారు మురళి, టీడీపీ మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, నాయకులు రావి పెంచలరెడ్డి, లక్ష్మీ నరసారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

● సంగంలో అవగాహన ర్యాలీ

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో యోగాంధ్రపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ముంబాయి రహదారి వరకు ర్యాలీ సాగింది. యోగా చేయండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ అధికారులు, సిబ్బంది నినాదాలు చేశారు. మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మర్రిపాడులో...

మర్రిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మే 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడులో..

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరుపుతున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పలు శాఖల అధికారులు, ఉద్యోగులు జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. క్రమం తప్పకుండా యోగా సాధనతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం దూరం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని చెప్పారు. మానసిక ఒత్తిడిని దూరం చేసుకొని ప్రశాంతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగూర్‌వలి, సీహెచ్‌వో రాజశేఖరరాజు, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరిలో నేడు 2500 మందితో..

ఉదయగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయగిరి పట్టణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన ర్యాలీ చేపట్టారు. పంచాయతీ బస్టాండ్ నుంచి రంగనాయకులస్వామి ఆలయం వరకు ర్యాలీ సాగింది. ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, శారీరక ఉల్లాసం కోసం ప్రతిఒక్కరు యోగా చేయాలన్నారు. మంగళవారం స్థానిక రంగనాయకులస్వామి ఆల యంలో 2,500 మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, సందానీ, మట్ల రామయ్య, లక్ష్మయ్య, ఉప్పుటూరి వెంకటయ్య, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, డీటీ జహీర్, హెచ్ఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతారని తెలిపారు.



ఉదయగిరిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

● యోగాతో మెరుగైన జీవనం

వింజమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్నీ వయసులవారికి యోగాని చేరువ చేసి మెరుగైన జీవన విధానం అలవాటు చేయడమే యోగాంధ్ర కార్యక్రమ లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వింజమూరులో ఎంపీడీవో ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నీ శాఖల అధికారులు, సిబ్బంది, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో మెదడు చురుకుగా పనిచేస్తుందని, ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిపెంట వెంకటసుబ్బారెడ్డి, డేగ మధుయాదవ్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంగం : యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది



వరికుంటపాడు : జాతీయ రహదారిపై అధికారులు, సిబ్బంది మానవహారం



వింజమూరులో జరిగిన యోగాంధ్ర కార్యాక్రమంలో అధికారులు, విద్యార్థులు

క్షయ ముక్త్ భారత్ లక్ష్యంగా కృషి

- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సంగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి నయం చేయడంతో టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం పెరమన గ్రామంలో 104 (ఎఫ్‌డీపీ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్‌భారత్ (ముందుగానే టీబీని గుర్తించడం) గురించి వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. 60 ఏళ్ల పైబడిన వారు, మధుమేహ వ్యాధి గ్రస్తులు, ధూమ, మద్యపాన అలవాటు ఉన్నవారికి క్షయ పరీక్షలు చేయా లని సూచించారు. త్వరలో మొబైల్ ఎక్స్‌రే వాహనం అందుబాటులోకి వస్తుందని, ప్రతి గ్రామంలో అనుమానితులకు ఎక్స్‌రే తీస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షయ నివారణ కార్యక్రమ వాల్ పోస్టర్లను విడుదల చేశారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



మా ఇళ్ల స్థలాలకు రక్షణేది?

వింజమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటుకూరు గ్రామ ఎస్సీ కాలనీలో 43 సంవత్సరాలుగా ప్రజలు నివసిస్తున్నారు. అయితే ఆ స్థలాలు తమవంటూ కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. సోమవారం స్థానిక తహసీల్దారుకు వినతిపత్రం అందించి మీడియా ముందు గోడు వెళ్లబోసుకున్నారు. 43 సంవత్సరాల క్రితం సర్వే నెంబరు 489/2, 3లలో 4 ఎకరాల 98సెంట్లు భూమిని అప్పటి ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు, శ్మశాన వాటికకు మంజూరు చేసిందని చెప్పారు. అప్పటి నుంచి అక్కడే జీవిస్తున్నామని తెలియజేశారు. అయితే స్థలం తమదంటూ కొంతమంది వ్యక్తులు, శ్మశాన వాటికను ఆనుకుని ఉండే ఖాళీ స్థలాల్లో చెట్లను జేసీబీ సహాయంతో తొలగించడంతో మేము అడ్డుకుని స్థానిక తహసీల్దారుకి ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

దక్షిణ కాలువకు సమృద్ధిగా నీరు

- సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవ చౌదరి

చేజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువకు సమృద్ధిగా నీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి తెలిపారు. రెండు రోజుల క్రితం కలువాయి మండలం వెదనపర్తి రిజర్వాయర్ వద్ద గేట్ మరమ్మతులకు గురైన నేపథ్యంలో నీటి ప్రవాహం తగ్గిందని, ఆదివారం రాత్రి నుంచి యథావిధిగా దక్షిణ కాలువకు నీటి సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐఏబీ సమావేశంలో నిర్ణయించిన మేర ప్రతి ఎకరాకు నీరు అందుతుందని ఆయన తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనతోనే ఎరువులు వాడాలి

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకే తమ పంట పొలాలకు ఎరువులు, పురుగు మందులు వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేఖదేవి, నెల్లూరు ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. సోమవారం మండలంలోని నందిపాడు రైతుసేవా కేంద్రంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, కొత్తరకం వంగడాలు, ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట విత్తనాల ఉపయోగాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో వచ్చే కలుపు నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుస్మిత, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.



వికసిత అభియాన్ సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సురేఖదేవి

CRIME NEWS

విద్యుదాఘాతానికి వ్యవసాయ కూలీ మృతి



మస్తానయ్య మృతదేహం

మనుబోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరుకి చెందిన కొణతం మస్తానయ్య (40) సోమవారం వేకువన విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని దళితవాడకు చెందిన మస్తానయ్య వ్యవసాయకూలీ. 14 ఏళ్ల క్రితం అనారోగ్యంతో భార్య చనిపోయింది. దీంతో ఆయన కూలీ చేసుకుంటూ ఇద్దరు మగపిల్లలను పోషిస్తున్నాడు. ప్రతిరోజూ రాత్రి ఇద్దరు పిల్లలు టీవీ చూసేందుకు పక్కనే ఉన్న అమ్మమ్మ ఇంటికికాని, పెదమ్మ ఇంటికి కాని వెళ్లి అక్కడే నిద్రిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భోజనం చేశాక పెదమ్మ ఇంటికి వెళ్లారు. సోమవారం వేకువన ఇంటిబయట మస్తానయ్య చనిపోయి ఉండటాన్ని చూసిన స్థానికులు కేకలు వేయడంతో మస్తానయ్య కుమారులు పరుగున వచ్చారు. ఎడమచేతివేళ్ల మధ్య నల్లగా ఉండడాన్ని గమనించారు. రాత్రి సమయంలో బహిర్భూమికని వచ్చి, నిద్రమత్తులో పొరపాటున వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నట్లు కుమారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమార్టం కోసం మస్తానయ్య మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి, తండ్రిని పోగొట్టుకున్న ఆ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

రాపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణ సమీపంలోని మద్దెలమడుగు జంక్షన్ దగ్గర్లో ఆదివారం అర్ధరాత్రి అజయ్ నాయక్ (20) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ హరి చందన తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజయ్ మద్దెల మడుగు జంక్షన్ సమీపంలోని ఓ ధాబాలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ధాబా లో విధులు ముగించుకున్న అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెల్లా చెదురైన మృతదేహాన్ని సోమవారం గ్రామస్తులు చూసి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అజయ్ నాయక్‌గా గుర్తించారు. అజయ్‌కు వివాహమై ఒక కుమారుడున్నాడు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైనేజీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి):నగరంలోని బృందావనం యూనియన్ బ్యాంకు సమీపంలో డ్రైనేజీ కాలువలో మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. అనంతరం సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. 46వ డివిజన్ వీఆర్వో శివ ఫిర్యాదుతో ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు స్వల్పగాయాలు



హజరత్‌రావు(ఫైల్)

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు మార్గంలో నాగిరెడ్డిపాలెం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. పోలంపాడుకు చెందిన దామంచర్ల హజరత్‌రావు(49) కలిగిరిలో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కొంతమంది యువకులకు ఉపాధి కల్పిస్తున్నాడు. ఆదివారం తన భార్యతో కలిసి రావిపాడు నుంచి కలిగిరికి మోటార్‌సైకిల్‌పై వస్తూ నాగిరెడ్డిపాలెం సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న మరో బైక్‌ను ఢీకొ ట్టాడు. ఈ ఘటనలో హజరత్‌రావు రోడ్డుపై పడి తలకు తీవ్రగా యాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించగా అక్కడ మృతి చెందాడు. ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి ఒక కుమార్తె ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ వేధిస్తున్నాడని మహిళ ఆత్మహత్యాయత్నం

- సెల్ఫీ వీడియోలో ఆరోపణలు

చేజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి వేధిస్తున్నాడంటూ చేజర్ల మండలం ఆదురుపల్లికి చెందిన జమీలా అనే మహిళ సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించింది. సేకరించిన సమాచారం మేరకు.. ఆదురుపల్లికి చెందిన మక్బూల్ జాన్, జమీలా కుటుంబాల మధ్య ఇంటి విషయంలో కొంతకాలం గా వివాదం నడుస్తోంది. సోమవారం మక్బూల్ జాన్ వివాదాస్పద ఇంటిలోకి సామాన్లు తీసుకొని ప్రవేశించింది. ఈ విషయం తెలుసుకున్న జమీలా ఆత్మహత్యకు యత్నించింది. అంతకుముందు సెల్ఫీ వీడియో ద్వారా సీఐ ఆరోపణలు చేసింది. తన తల్లి పేరిట ఉన్న ఆ ఇల్లు తనదని, అయితే సంగం సీఐ ఆ ఇంటి తాళాలు పగలగొట్టి మక్బూల్ వాళ్లని ఇంటిలోకి పంపించాడని ఆరోపించింది. ఇంటి విషయమై ఎనిమిది నెలల నుంచి సీఐ చుట్టూ తిరిగినా తమకు న్యాయం చేయలేదని, తన చావుకు కారణం సీఐ వేమారెడ్డే అని సెల్ఫీ వీడియోలో పేర్కొంది. జమీలాను కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై చేజర్ల ఎస్ఐ తిరుమలరావుని సంప్రదించగా విచారిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో కారులో గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను సోమవారం వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐ కే. శ్రీనివాసరావు విలేకరులకు వెల్లడించారు. వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు ఈనెల 8 సాయంత్రం తల్పగిరి కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలోని ఖాళీ ప్లాట్‌లో ఉన్న కారులో పోలీసులు తనిఖీలు చేశారు. నాయుడుపేట మండలం కానూరు రాజుపాలెంకు చెందిన ఈతముక్కల సాయికిరణ్, తోటపల్లి గూడూరు మండలం సౌత్ ఆములూరుకి చెందిన మద్దిని దిలీప్, వెంకటగిరిలోని చింతలగుంట నెహ్రూనగర్‌కు చెందిన లేబాకు జనార్దన్ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయి, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో బుచ్చి-జొన్నవాడ మార్గంలోని పెట్రోలు బంకు పక్కనే ఉన్న సెంట్రల్ ఛానల్ కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానిక ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు బుచ్చి ఖాజానగర్‌కు చెందిన షాకీర్(40)గా గుర్తించినట్టు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. అతను మతిస్థిమితం తప్పడంతోపాటు మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

మట్టి మాఫియాకు ఇరిగేషన్ అధికారుల అండ : సర్పంచు

కందుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు గ్రామ చెరవులో పంచాయతీ అనుమతులు లేకుండా పట్టపగలే మట్టి మాఫియా చెలరేగి పోతోందని ఆ గ్రామ సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కందుకూరు ఇరిగేషన్ డీఈ, మండలస్థాయి అధికారులు మామూళ్లు తీసుకుంటూ మట్టి మాఫియాకు అండదండలు అందిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలోని గంగకుంటలో మట్టి తవ్వకాలు జరపబోగా గ్రామస్థులు, తాను అడ్డుకున్నామన్నారు. మళ్లీ చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్థులు అడిగితే ఎవ్వరికీ పోవాల్సినవి వారికి పంపామని, ఇంక ఎవ్వరు అడ్డుకుంటారో చూస్తామని దురుసుగా ప్రవర్తించారని అన్నారు. తాను ఈ విషయాన్ని కార్యాలయం వద్దకు వెళ్లి ఫోన్‌లో డీఈని సంప్రదించగా, అనుమతుల కాపీ ఉందని, తాను వేరే క్యాంపులో ఉన్నానని సరిగా సమాధానం చెప్పలేదన్నారు. అనుమతి ఉంటే నిబంధనల ప్రకారం అధికారులు మార్కింగ్ ఇచ్చి తవ్వుకోవాల్సి ఉందన్నారు.



మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు

● వెంకటేశ్వర నాయక్, సర్వాయపాలెం పశు వైద్యుడు

కావలిరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కావలి మండలం సర్వాయపాలెం పశు వైద్యుడు బీ.వెంకటేశ్వరనాయక్ పేర్కొన్నారు.

ఈ వారం ఇంటర్వ్యూ

? కావలి మండలంలో ఎన్ని మూగజీవాలు ఉన్నాయి. పశువులకు రాయితీపై దాణా అందిస్తున్నారా.

! మండలంలో 3,300 ఆవులు, 8,950 గేదెలు, 28,700 గొర్రెలు, మేకలతో కలిపి మొత్తం 40,950 మూగ జీవాలు ఉన్నాయి. ప్రభుత్వం పశువులకు రాయితీపై 5 టన్నులు దాణా పంపింది. 50 కేజీల దాణా బస్తా ధర రూ.1155 కాగా 50 శాతం రాయితీపై రూ.550కి ఇస్తున్నాం.

? వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారా.

! గొంతువాపు వ్యాధికి పెద్ద పశువులకు, గొర్రెలు, మేకల వంటి సన్నజీవాలకు నీలి నాలుక వ్యాధి, నేలమరక వ్యాధి సోకకుండా టీకాలు అందిస్తున్నాం.

? నట్టల నివారణపై అవగాహన కల్పిస్తున్నారా.

! ఈనెల 15వ తేదీ నుంచి నట్టల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. సచివాలయాల్లో 15వ తేదీ నుంచి పశువైద్య సహాయకులచే మందులు పంపిణీ జరుగుతుంది.

? గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! కావలి మండలంలో ప్రాంతీయ వైద్యశాల మినహా అన్నగారిపాలెం, సర్వాయపాలెంలో రెండు పశువైద్యశాలలు, గౌరవరంలో ఒక గ్రామీణ పశు వైద్యశాల ఉంది. ప్రతి సచివాలయ పరిధిలో పశువైద్య సహాయకులు ఉన్నారు. సిబ్బంది కొరత లేదు.

జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని శ్రీవివేకా జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కోటారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషు పేపర్ పరీక్షల కోసం అదే పట్టణంలోని వివేకా జూనియర్ కళాశాలలో సెంటర్ ఇచ్చారని చెప్పారు. అయితే వివేకా విద్యా సంస్థల యాజమాన్యం వారు గాయత్రి కళాశాలలో మెరిట్‌గా చదువుతున్న కొందరు విద్యార్థుల పేర్లను సేకరించి వారు రాసిన ఇంగ్లీషు పేపర్లను ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. రిజల్టు అనంతరం విద్యార్థి వారి తలిదండ్రులు కళాశాల యాజమాన్యం వారు ఇంటర్ బోర్డు అధికారులను ఆశ్రయించారని చెప్పారు. దీనిపై ఇంటర్ బోర్డు అధికారులు శ్రీ వివేకా కళాశాలపై నిజనిర్ధారణ కమిటీ వేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కానీ ఈ నిజనిర్ధారణ కమిటీ వారు రావడం, రిపోర్టు ఇవ్వడం జరిగినప్పటికీ ఇప్పటి వరకు శ్రీ వివేకా కళాశాల యాజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.. వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యోగాతో ఎన్నో ప్రయోజనాలు



కందుకూరు : యోగాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, రాజకీయ నేతలు



కావలి : ర్యాలీలో ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్



అల్లూరు : యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, తదితరులు

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాతో ఎన్నో మానసిక, ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ చెప్పారు. సోమవారం కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి కోవూరు రోడ్డు వరకు యోగాంధ్రపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పలువురు అధికారులు, యోగా మాస్టర్ ట్రైనర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

● **కావలి :** కావలి పట్టణంలో సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపాల్టీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో పాటు మున్సిపల్ అధికారులు, యోగా గురువులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పొదుపు గ్రూపులు, సచివాలయ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే రోడ్డు, ట్రంకురోడ్డు మీదుగా స్థానిక ఉదయగిరి బ్రిడ్జిసెంటర్ వరకు సాగింది. ఈ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవల కావలి పట్టణ ఐకాన్ సెంటర్‌లో యోగాసనాలు చేయించామని, పట్టణంలో యోగా నేర్చుకునే వారి కోసం ఒక సర్వే నిర్వహించి యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

● **అల్లూరు :** అల్లూరులో అధికారులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని రామకృష్ణ విద్యాసంస్థల వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నగర పంచాయతీ అధికారి వరప్రసాద్, యోగా సాధకులు కొప్పు శ్రీనివాసరావు, బ్రహ్మానందరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** బోగోలులో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోగోలు బజారు కూడలి నుంచి రైల్వే ఎల్సీగేట్ 144 వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో సయిమ్‌తాజ్‌హసన్, తదితరులు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని చుండి పోలినేనిచెరువు, అంకభూపాలపురం, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, శామీరపాలెం, కొండసముద్రం, పోకూరు, నూకవరం, బడేవారిపాలెం, నేకునాంపురం, నలదలపూరు, శాఖవరం, కళవళ్ల అయ్యవారిపల్లె గ్రామాలలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడల్లో మానవహారం ఏర్పాటు చేసి, యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, ఏపీవో దయాసాగర్, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్ :** వ్యాయామంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దారు



వలేటివారిపాలెంలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు



కావలి రూరల్ : ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు నిర్వహిస్తున్న సిబ్బంది

అసంపూర్తి గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

● హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కందుకూరు హౌసింగ్ డీఈఈ పీవీ నారాయణరెడ్డి

లింగసముద్రం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్టీఆర్, పీఎంఏవై పథకాల కింద నిర్మిస్తున్న అసంపూర్తి పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కందుకూరు హౌసింగ్ డీఈఈ పీవీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని హౌసింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో 725 పక్కా గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 31వ తేదీ నాటికి అన్ని గృహాల నిర్మాణాలను పూర్తి చేసి, లబ్ధిదారులచే గృహ ప్రవేశాలు చేయించాల్సి ఉందన్నారు. కానీ వీటిలో 628 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని, 97 గృహాల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు. వీటిని త్వరగా లబ్ధిదారులచే పూర్తి చేయించాలని అధికారులను, సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన పెదపవనిలో నిర్మిస్తున్న పక్కా గృహాలను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. ఆయన వెంట మండల ఏఈఈ జే.నాగరాజు, వర్క్ఇన్‌స్పెక్టర్ నిర్మల ఉన్నారు.

వందేభారత్ రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వందేభారత్ రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం కావలి కళుగోళమ్మ గుడి వెనుక జరిగింది. జీఆర్పీ ఎస్ఐ రమాదేవి వివరాల మేరకు.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని మహిళ దిగువ మార్గంలోని రైలు పట్టాలు దాటుతుండగా వందేభారత్ రైలు ఢీకొని మృతి చెందింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతురాలి రెండు చేతులపై ట్యాటు మార్కులు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వర్ణాంధ్ర-2047 చంద్రబాబు లక్ష్యం

● ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి



నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై ఆర్డీవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 2047కి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఆ సమయానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్-2047ను లాంఛనంగా ప్రారంభించా రని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో అధికా రులతో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటమే లక్ష్యంగా సీఎం అడుగులు వేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి, ఖ్యాతి, ప్రజల మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ, విద్యావిధానం, పారిశ్రామిక ప్రగతి అన్నింటిని కలగలిపి భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలపడానికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక డాక్యుమెంట్‌ను రూపొందించి అందులో సుమారు 10 అంశాలు 10 రకాల పారా మీటర్స్‌ను తీసుకుని భవిష్యత్తులో ఏవిధంగా ప్రతి డిపార్ట్‌మెంట్‌ను అభివృద్ధి చేస్తే 2047కు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుకోవచ్చన్నారు. కావలి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్డీవో ఆధ్వర్యంలో డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్న వారి టీమ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కావలి నియోజకవర్గం భవిష్యత్తులో పారిశ్రామికవాడ, ఎయిర్‌పోర్టులకు, ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు ఇలా అన్నింటిని అనుసంధానం చేసుకుంటూ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యాపరంగా ముందుకు పోవడానికి మంచి డాక్యుమెంట్ తయారు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

కొండాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 5 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేసినట్లు ఎంఈవో కె.రవికుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తన్నీరు మణితేజ, కొప్పోలు దివ్యసాహితి, ఆదర్శ పాఠశాలకు చెందిన దొడ్ల దేవిశ్రీ, ఎస్.మనోజ్ఞ, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణపతిరాజు వేద విద్యాధరిలకు ఒక్కొక్కరికి రూ. 20వేల, ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు.

● **లింగసముద్రం :** నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన 4 విద్యార్థినులు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన కంచరగుంట మహాలక్ష్మి, పతకమూరి సుష్మ, పెదపవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఎస్ కవిత, ఎం శ్రావణిలు ఉన్నారు. వీరిని డీఈవో బాలాజీరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు, ప్రిన్సిపాల్ కె స్నేహలత అభినందించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలోని చుండి, పోకూరు, వలేటివారిపాలెం, కేజీబీవీ స్కూల్లో 10 తరగతిలో ఉత్తమ ప్రతిభ కబరిచిన 7గురు విద్యార్థులు, షైనిక స్టార్స్ అవార్డులు అందుకున్నారు. వారిలో పోకూరు సాయి సిద్దార్థ హైస్కూలుకు చెందిన మేకనబోయిన రక్షిత, గడ్డం రాహుల్, చుండి మోడల్‌స్కూల్‌కు చెందిన బోడా మల్లికార్జున, వీరమోసు జయసంహిత, వలేటివారిపాలెం హైస్కూల్‌కు చెందిన గొట్టిపాటి లక్ష్మీ, పోకూరు హైస్కూల్‌కు చెందిన జడా మహల్య, కేజీబీవీలో విద్యార్థిని పేరం మహిత ఉన్నారు.

‘ఉపాధి’ అవకతవకలకు పాల్పడితే ఇంటికే..




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిని తొలగిస్తామని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఉద్యోగులకు, ఇతర ప్రాంతాలలో ఉన్న వారికి, చదువుకుంటున్న వారికి మస్టర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ పనులను టీఏలు, ఏపీవో, ఈసీ, తాను తనిఖీలు చేస్తామన్నారు. మండలానికి మంజూరైన 32 నీటితొట్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పనికి మూడు దశల్లో ఫొటోలు తీయాలన్నారు. అలాగే ఫారం పాండ్లను కూడా త్వరగా నిర్మించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటించాలన్నారు. ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్, ఈసీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి



కావలి : డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ మహిళా నేతలు



కొండాపురం : తహసీల్దారు కోటేశ్వరావు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

● కావలి డీఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళలు

కావలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన జగన్ రోత మీడియా, జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని కావలి పట్టణ టీడీపీ అధ్యక్షురాలు అర్షియాబేగం కోరారు. ఈ మేరకు మహిళలతో కలిసి సోమవారం కావలి డీఎస్పీ పీ.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మీడియా వేదికగా లైవ్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లేలా అనుచిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, మీడియా యాజమాన్యంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

● కొండాపురం : అమరావతి మహిళలను కించపరచేవిధంగా మాట్లాడిన జర్నలిస్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు సోమవారం తహసీల్దారు కోటేశ్వరారవుతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీనియర్ జర్నలిస్టులైనప్పటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా మీడియాలో రాజధాని ప్రాంత మహిళలను అసభ్య పదజాలంతో మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, తెలుగుయువత అధ్యక్షుడు దాసరి అశోక్, వి.బాలకృష్ణ, పీ.చైతన్య, ఎం.మాధవ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పనులకు ఒకరికి బదులు మరొకరు రావద్దు

లింగసముద్రం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులకు ఒకరికి బదులు మరొకరు రాకూడదని ఏపీవో దయాసాగర్ చెప్పారు. సోమవారం మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో జరుగుతున్న పనులను టీఏ జీ వీరరాఘవులతో కలిసి తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశబూలించారు. ఒకరికి బదులు మరొకరు పనులకు వస్తే వారిని పరిగణలోకి తీసుకోమన్నారు. జాబ్ కార్డు కుటుంబానికి ఒకటి మాత్రమే ఇస్తారని చెప్పారు. అలాగే 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వరకు కూలీలు రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అలాగే 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కల వారు రూ.436 ప్రీమియం చెల్లిస్తే సాధారణ మరణానికి రూ.2 లక్షలు బీమా వస్తుందని చెప్పారు.

సచివాలయ ఉద్యోగికి ఆర్థిక సాయం



మహేష్ తండ్రి శ్రీహరికి చెక్కు అందజేస్తున్న సాయిపేట గ్రామస్థులు

కొండాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి సచివాలయంలో ట్రాన్స్‌కో జేఎల్ఎంగా పనిచేస్తున్న బ్యగుమళ్ల మహేష్‌కు సోమవారం పలువురు దాతలు సుమారు రూ.3.61 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సాయిపేటకు చెందిన మహేష్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. దీంతో స్పందించిన పలు గ్రామాల ప్రజలు అతని వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ స్వగ్రామం సాయిపేట గ్రామస్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.1,98,117, భీమవరప్పాడు గ్రామస్థులు, ఆ గ్రామంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.1,63,100లకు సంబంధించిన చెక్కును బాధితుడి తల్లిదండ్రులకు అందజేశారు. తమ కుమారుడిని ఆదుకునేందుకు ముందుకువచ్చిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ పనుల ప్రారంభం

బిట్రగుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని స్కిల్ డెవలెప్‌మెంట్ విద్యార్థుల అవసర్థాం రూ.5.50 లక్షలతో మంజూరైన పైపులైన్ పనులను ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మంచి సమస్యను గుర్తించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయి వెంటనే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్రనాథ్, డిప్యూటీ ఎంపీడీవో నయిమ్‌తాజ్ హసన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతాప్, అజయ్, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు

బిట్రగుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భోజ్యా సోమవారం అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురం దక్షిణాన బోగోలు చెరువులో ఆదివారం రాత్రి అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను తిప్ప పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అక్రమ గ్రావెల్ తరలింపుపై నిఘా ఉంచామన్నారు. పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను మండల తహసీల్దారుకు అప్పగించి ఆయన ఆదేశాల మేరకు జరిమానా విధించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

99 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 354 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 255 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-70, ఆర్ఆర్-6, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 99 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.243.71గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

ఇక నుంచి మూడు రోజులు..

వలేటివారిపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) వలేటివారిపాలెం గ్రంథాలయంలో ఇక నుంచి వారంలో మూడు రోజులు సోమ. బుధ, శనివారాల్లో పాఠకులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు ఇన్‌చార్జి గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గుడ్లూరు రెగ్యులర్ గ్రంథపాలకుడుగా ఉంటూ ఒక రోజు వలేటివారిపాలెం ఇన్‌చార్జి గ్రంథపాలకుడుగా పని చేశానని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇక నుంచి వలేటివారిపాలెంలో మూడు రోజులు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కందుకూరు ఎస్ఐగా శివనాగరాజు



ఎస్ఐ శివనాగరాజు

కందుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణ ఎస్ఐగా శివ నాగరాజు నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలో శాంతిభద్రతలకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 4 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కె అనూష తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.


చైర్మన్ సీతారామయ్యకు అభినందనలు

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ప్రకాశం జిల్లా మాజీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తానికొండ ఆంజనేయులు సోమవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : గత నెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జరిగిన 8వ ఓపెన్ తైక్వాండో జాతీయస్థాయి చాంపియన్ షిప్‌లో కందుకూరుకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడంతో జిల్లా కార్యదర్శి మాస్టర్ షేక్ అబ్దుల్ సలాం సోమవారం వారిని అభినందించారు.

అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు



రోజురోజుకు పెరుగుతున్న వాహనరద్దీ ● చెక్‌పాయింట్‌లోనే గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షణ

తిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుమలకు చేరుకోకముందే శ్రీవారి భక్తులకు అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు. దర్శనానికే కాకుండా తనిఖీలకూ ఇంతేసి సమయం వాహనాలల్లో నిరీక్షించాల్సి వస్తోంది. తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తిరుమలకు వెళ్లే ప్రతి వాహనాన్ని, భక్తులను, లగేజీని తనిఖీ చేస్తుంటారు. ఇక్కడ 12 లైన్లు ఉన్నాయి. ఇందులో ఒక లైన్‌ను వీఐపీల కోసం, మరో రెండు లైన్లను ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య చెక్ పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి.

ఇవీ కారణాలు..

వాహనాలు భారీగా నిలిచిపోవడానికి వివిధ రకాల కారణాలు కనిపిస్తున్నాయి. కొవిడ్ ముందు వరకు రోజుకు 7,500 నుంచి 8 వేల వరకు వాహనాలు తిరుమలకు వచ్చేవి. కొవిడ్ సమయంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కన్నా ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం క్షేమమని భావించారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. గ్రామాల నుంచి కూడా కొందరు కలిసి ట్యాక్సీ మాట్లాడుకుని రావడానికి అలవాటు పడ్డారు. దీంతో ప్రస్తుతం సాధారణ రోజుల్లో 9 వేలు, రద్దీరోజుల్లో 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. దీంతో పాటు 2022లో ఏర్పాటు చేసి స్కానర్లలో చాలా వరకు సక్రమంగా పనిచేయడం లేదు. ఇందువల్ల ఆలస్యమవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తనిఖీల విధుల్లో ఎస్పీఎఫ్ సిబ్బంది 35 నుంచి 40 మంది, విజిలెన్స్ సిబ్బంది 24 మంది ఉంటారు. ఈ సంఖ్య సరిపోవడం లేదు.

విస్తరణపై దృష్టి

అలిపిరి తనిఖీ కేంద్రాన్ని మరింత విస్తరించడం తప్ప మరోదారి లేదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతమున్న 12 లైన్లను 14 లైన్లుగా మార్చడం ఇందులో ఒకటి. అలాగే అత్యాధునిక స్కానర్లు, సిబ్బంది పెంపు, వారికి ప్రత్యేక శిక్షణ వంటి వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. ఇవి అమలైతే అలిపిరిలో నిరీక్షణ సమయం తగ్గే అవకాశం ఉంది.

వజ్రకవచంలో మలయప్ప

జ్యేష్ఠాభిషేకం తొలిరోజు సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి వజ్రకవచంలో దర్శనమిచ్చారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించి సహస్రదీపాలంకార సేవలో కొలువుదీర్చారు. సేవ అనంతరం స్వామివారు నాలుగమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాదిలో ఒక్కసారే ఈ వజ్రకవచంలో దర్శనమివ్వడం గమనార్హం. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇక, మంగళవారం ముత్యపు కవచం, బుధవారం స్వర్ణకవచంతో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి







గేటు వద్ద దూసుకెళుతూ..



సాక్షి కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

మహిళలకు మీరిచ్చే గౌరవం ఇదేనా?

జగన్, భారతి క్షమాపణ చెప్పాలి ● సాక్షి కార్యాలయం వద్ద కూటమి నేతల ఆందోళన.. ఉద్రిక్తత

రేణిగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి మహిళల గురించి సాక్షి ఛానల్‌లో జరిగిన చర్చను చూస్తే చాలు. మహిళలకు మీరిచ్చే గౌరవం ఏపాటిదో అర్థమవుతుంది' అని జగన్‌ను ఉద్దేశించి కూటమి నేతలు పేర్కొన్నారు. ఆ ఛానల్ చర్చలో వాడిన అసభ్యపదజాలాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం రేణిగుంటలోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట కూటమి నాయకులు, మహిళలు ఆందోళనకు దిగారు. మాజీ సీఎం జగన్, ఆ ఛానల్ అధినేత భారతిరెడ్డి వెంటనే అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో ఆగ్రహావేశాలు తట్టుకోలేక సాక్షి కార్యాలయం వైపు రాళ్లు రువ్వారు. మహిళలు లోపలకు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని నిలువరించారు. ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్, సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో వైసీపీ నాయకులు కుట్ర ప్రకారం బురదజల్లేందుకు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే సాక్షి ఛానల్‌లో అమరావతి మహిళల మనోభావాలు దెబ్బతినేలా పనికిమాలిన మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. ఈ ఘటనలో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేయగా, ఇవేమీ పట్టనట్టు తిరిగి వైసీపీ నాయకుడు సజ్జల మీడియా ముందు తాము తప్పు ఏమీ చేయలేదన్నట్టు సమర్థించుకోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే సాక్షి ఛానల్, పత్రికను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, కార్పొరేటర్ అనిత, చినబాబు, కృష్ణయాదవ్, మధుబాబు, సుబ్రమణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళనకారులపై సాక్షి ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ప్రతిభకు పట్టం

- 'షైనింగ్ స్టార్స్' అవార్డు ఉద్దేశమన్న మంత్రి అనగాని
- 40 మంది ఇంటర్, 207 మంది పదో తరగతి విద్యార్థులకు పురస్కారాల ప్రదానం
- ప్రశంసాపత్రం, పతకం, రూ.20 వేల నగదు బహూకరణ



'షైనింగ్ స్టార్' విద్యార్థులతో మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభకు పట్టం కట్టేందుకే షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేస్తున్నట్టు జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో దేశంలోనే మూడో స్థానం నుంచి గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం 19వ స్థానానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ విద్యారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారన్నారు. తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం మాట్లాడుతూ.. పేదరికం రూపుమాపాలన్నా రాష్ట్రం అభివృద్ధి సాధించాలన్నా విద్యతోనే సాధ్యమని, అందుకే ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలోనే ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇస్తున్నారని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, హస్తకళల కార్పొరేషన్ పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులతో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రదానం చేశారు. జిల్లాలో ఈ 2024-25లో అత్యుత్తమ మార్కులు సాధించిన పదో తరగతిలో 207 మంది, ఇంటర్‌లో 40 మంది విద్యార్థులకు.. ఒక్కొక్కరికి రూ.20 వేల చెక్కు, మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.



ఇంకా బాగా చదవాలనిపిస్తోంది

నేను ఎర్రావారి పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివా. 591 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకును సాధించాను. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా పరిగణించడం, ఇలాంటి వేదికపై అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడంతో మరింత మంచిగా చదవాలనిపిస్తోంది. – షేవిత



పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన నాకు 962 మార్కులు వచ్చాయి. ఇలా మంచి మార్కులు వచ్చిన వారిని ప్రైవేటు కళాశాలల్లోనే ప్రోత్సహించేవారు. ఇప్పుడు షైనింగ్ స్టార్స్ పేరిట ప్రభుత్వ కళాశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఇవ్వడం నాలాంటి పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మాలాంటి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు థ్యాంక్స్. బాగా చదువుకుని స్థిరపడ్డాక నేనూ ఇలా ఇతరులకు ప్రోత్సాహం అందిస్తా. – తుపాకుల శ్రీజ

నేడు జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి యోగాంధ్ర పోటీలు జరగనున్నాయి. మండలస్థాయిలో విజేతలకు ఈ పోటీలు ఉంటాయని యోగాంధ్ర నోడల్ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత విభాగాల్లో ఒంటరి ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం పోటీలు ఉంటాయన్నారు. జూనియర్ విభాగం 10-18, యువ విభాగం 19-35 సంవత్సరాలవారికి పోటీలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 88612 95049లో సంప్రదించాలన్నారు.

డీపీటీవోగా జగదీష్



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా ఎం.జగదీష్ పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆయన చిత్తూరు డీపీటీవోగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడున్న వెంకటరావును విజయవాడ డీపీటీవోగా బదిలీ చేశారు. అన్నమయ్యజిల్లా డీపీటీవోగా ఉన్న రాముకు చిత్తూరుజిల్లా ప్రజారవాణాధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా జగదీష్ ఈ వారంలో బాధ్యతలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీసీవోగా నాగవర్ధన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార శాఖ అధికారిణిగా తిరుపతి డీసీవో ఎస్. లక్ష్మి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్వీ నాగవర్ధనను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్, ఎస్పీ తదితరులు


విజన్‌తో ముందడుగు

- ఎమ్మెల్యేలు, అధికారుల భాగస్వామ్యంతో కార్యాచరణ
- ఇన్‌ఛార్జి మంత్రి అనగాని వెల్లడి
- జిల్లా, నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్ యూనిట్లు ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో విజన్-2047తో ముందడుగు వేస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నియోజకవర్గాల అభివృద్ధిలో ఎమ్మెల్యేలు, అధికారులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. అమరావతి నుంచి జిల్లాలు, నియోజకవర్గాల విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్లను వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి మంత్రి అనగాని, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిజిల్లాలో జిల్లా,నియోజకవర్గ, మండల, సచివాలయ స్థాయి విజన్ డాక్యుమెంట్లు రూపొందించామని వివరించారు. ఈ ఐదేళ్లలో సాధించే అభివృద్ధితో పాటు 2047 నాటికి సాధించాల్సిన దానినీ వీటిలో పొందుపరిచినట్లు తెలిపారు. విజన్ ప్లాన్ భవిష్యత్తులో గొప్పఫలితాలను ఇస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఐదుగురు సభ్యుల బృందాన్ని నియమించామన్నారు.జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తుడా వీసీగా జేసీకి అదనపు బాధ్యతలు

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి): తుడా వైస్ ఛైర్మన్‌గా జేసీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ప్రస్తుతం తుడా అదనపు బాధ్యతలు చూస్తున్న మౌర్య, ఇక కార్పొరేషన్ కమిషనర్‌గానే కొనసాగుతారు. జేసీగా ఉన్న శుభం భన్సల్ తుడా వీసీగా అదనపు బాధ్యతలు చూస్తారు. పట్టణాభివృద్ధి సంస్థలకు ల్యాండ్ బ్యాంక్‌లు ఏర్పాటుచేసే ఆలోచనలో జేసీలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.



తెప్పపై పద్మావతీదేవి అభయం



తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం పద్మసరోవరంలో అమ్మవారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6.30గంటలకు ఉత్సవమూర్తిని పద్మపుష్కరణి వద్దకు వేంచేపు చేసి పూజలు నిర్వహించి తెప్పపై అధిష్ఠింపచేశారు. అనంతరం పుష్కరిణిలో మూడు చుట్లు అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం నాలుగు మాడ వీధుల గుండా ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గజవాహన సేవ జరగనుంది.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లు సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,802

తలనీలాలు సమర్పించినవారు: 35,776



మహారథంపై గోవిందుడు






తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భక్తజన సందోహం మధ్య సోమవారం ఉదయం తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి మహారథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం 6.15గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాలవీధి, బేరివీధి, గాంధీరోడ్డుల మీదుగా యథాస్థానమైన రథమండపానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గోవిందన్నామ స్మరణలతో రథాన్నిలాగారు. ఆ సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య మహారథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించగా, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉత్సవాలలో జీయ్యంగార్లు, ఎఫ్ఏఅండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో శాంతి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో గోవిందుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

గత నెల 1757.. ఇప్పుడు 3307 యూనిట్లు

అదానీ స్మార్ట్ మీటర్లతో హడలిపోతున్న విద్యుత్తు వినియోగదారులు



ఆదానీ స్మార్ట్ మీటర్ బిగించాక వచ్చిన విద్యుత్ బిల్లు, ముందు వస్తున్న బిల్లు స్టేట్‌మెంట్

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదానీ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు హడలిపోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాక రెట్టింపు బిల్లులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగకున్నా బిల్లులు అధికమొత్తంలో వస్తుండడంతో చార్జీల భారం మోయలేమని వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు అంటున్నారు. ఇటీవల పాకాల మండలంలో వాణిజ్య వినియోగదారులకు అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చారు. ఈ నెలలో వచ్చిన బిల్లులు చూసి లబోదిబోమంటున్నారు. ఉదాహరణకు పాకాల ఆపరేషన్ పరిధిలో త్రీ ఫేజ్ వాణిజ్య సర్వీసు నెం.5426111005115 గత 23 నెలల్లో విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 1617 యూనిట్లు వినియోగమైంది. అత్యధికంగా ఒక నెలలో 25,963 రూపాయలు, అత్యల్పంగా ఒక నెలలో 16,732 రూపాయలు బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటర్ బిగించకముందు ఏప్రిల్ నెలలో 1757 యూనిట్లు వినియోగించి రూ.23,326 బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటరు బిగించాక మే నెలకు సంబంధించి ఒక్కసారిగా 3,307 యూనిట్లు వినియోగించారని, రూ.38,136 చెల్లించాలని బిల్లు వచ్చింది. వాడకం పెరగకపోయినా స్మార్ట్ మీటర్‌తో 1550 యూనిట్లు అదనంగా బిల్లులో చూపించి గత నెలకంటే రూ.14,810 ఎక్కువ రావడంతో వ్యాపారం ఎలా కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మీటరు ఉన్నప్పుడు పవర్ ఫ్యాక్టర్ 0.91, 0.88 వుండగా అదానీ స్మార్ట్ మీటర్‌తో పవర్ ఫ్యాక్టర్ 0.4 వచ్చింది. దీంతో యూనిట్లు పెరిగి బిల్లు అధిక మొత్తంలో వచ్చినట్లు తెలుస్తోంది. పాతమీటర్లతో రూ.300-400 వచ్చే బిల్లులు స్మార్ట్ మీటర్లతో 800-1000ల వరకు వస్తున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు. స్మార్ట్ మీటర్ల పనితీరును పరిశీలించకనే పాత మీటర్ల స్థానంలో బిగించి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు తొలగించి పూర్వం వున్న మీటర్లను బిగించాలని విద్యుత్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి

అధికారులకు జేసీ శుభం బన్సల్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 242 అర్జీలు

చిగురువాడ పంచాయతీలో నిధుల దుర్వినియోగం



తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు వార్డు సభ్యుడు కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యులపై ఇంత వరకు చర్యలు లేవని, ఇప్పటికైనా నిధులు దుర్వినియోగం చేసిన అధికారులు, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సర్పంచ్ బారి నుంచి పంచాయతీని కాపాడాలని కలెక్టరేట్‌లో ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు.

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అధికారులకు అందే ప్రతి అర్జీకి త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలను అందజేశారు. వివిధ సమస్యలపై ప్రజలు 242 అర్జీలు అందజేయగా అందులో వివిధ భూసమస్యలపై రెవెన్యూ 129 ఫిర్యాదులు అందడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన వారిలో ఉన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్



రత్నమయ్య, వెంకటగిరి

కాలు పోయింది.. పింఛను ఇప్పించండి

'నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయాను. దీంతో దివ్యాంగుడిగా మిగిలిపోయాను. నేను కూలీ పనికి వెళితేకాని కుటుంబం గడవదు. మా కుటుంబ పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వం పింఛను ఇప్పించి ఆదుకోవాలి' అని వెంకటగిరికి చెందిన రత్నమయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐలు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 94 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 94 ఫిర్యాదులు అందాయి. తొలుత అర్జీదారులు తమ ఫిర్యాదులను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సంబంధిత సర్కిళ్ల సీఐల వద్దకు వెళ్లారు. అక్కడ ఫిర్యాదులకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత అదనపు ఎస్పీల వద్దకు పంపారు. అక్కడ సమగ్రంగా దర్యాప్తు చేసి ఫిర్యాదులో ఉన్న ప్రధాన అంశాలను విచారించి వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరిస్తున్నారు. కొంత క్రిటికల్‌గా వున్న ఫిర్యాదులను ఎస్పీ హర్షవర్ధనరాజు వద్దకు పంపి విచారించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఇలా సోమవారం వచ్చిన అర్జీల్లో 56 శాతం వరకు పరిష్కారమయ్యాయి. ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే విజయశ్రీ



గాండ్లవీధి ప్రాంతంలో టీడీపీ నాయకులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ 'గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజలతో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం పూట ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే పూనుకున్నారు. సోమవారం ఉదయం సూళ్లూరుపేట పట్టణంలోని 18వ వార్డు గాండ్లవీధి ప్రాంతంలో పర్యటించారు. మొదట ఆర్డీవో కార్యాలయం ఎదురుగానున్న వీధిలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గణపతి నగర్, వనంతోపు వీధి, స్టేట్‌బ్యాంక్ వీధిలో పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అని ప్రజలను అడిగారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేవని, వర్షం వస్తే నీళ్లు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. వారం రోజుల్లో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ చిన్నయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకుంటున్న వారిని పలకరించారు. ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉండడంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇకపై సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉదయం 6:30నుంచి 7:30 గంటల వరకు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు మాలకొండయ్య, శ్రీనివాసులు, రాధాకృష్ణ, పోలూరు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

సింహ,ముత్యపు పందిరి వాహనాలపై

శ్రీనివాసుడి విహారం

వడమాలపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సింహ వాహనంపై స్వామివారు నరసింహస్వామి అలంకారంలో ఊరేగారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేతంగా స్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ జరిగింది. రాత్రి భోగశ్రీనివాస మూర్తిగా స్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఆశీనుడై మాడవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30-6.30 గంటల మధ్య ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు రూ.500 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాల్సి ఉంది.



ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాల ఆవిష్కరణ





ముద్దుకృష్ణమ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే - ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ..

పుత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్.. ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం ఆవిష్కరించారు. ముద్దుకృష్ణమ 79వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు రెండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానేతల సేవలను స్మరించుకున్నారు. అనంతరం చిన్నారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మహిళలకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. ముద్దుకృష్ణమ సేవాతత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సేవకుడిగా, నిరాడంబరతకు ప్రతీకగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. 1985లో విద్యాశాఖ మంత్రిగా ప్రతి గ్రామంలో ఒక పాఠశాల ఉండాలన్న సంకల్పానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ఫలితమే నాటి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి నేడు పెద్ద పెద్ద స్థానాల్లో స్థిరపడడానికి దోహదపడిందన్నారు. ఆయన మరణించి ఏడేళ్లు కావస్తున్నా.. విగ్రహావిష్కరణకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు రావడమే.. ప్రజల మదిలో ఆయన పదిలంగా నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ వాసు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, గాలి గోపినాథ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో కారు యజమానిపై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదానికి సంబంధించి కారు యజమానిపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన త్యాగరాజనగర్ వద్ద చోటు చేసుకుంది. డీఎస్పీ భక్తవత్సలం కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం ప్రాంతానికి చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ నిరంజన్ నాయుడు 2024లో చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో సోమవారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. వాయిదా చూసుకుని తిరిగి కారులో వెళుతుండగా త్యాగరాజనగర్ వద్ద దుండగులు రాడ్లు, కత్తులతో అతడిపై దాడి చేశారు. తల, కాళ్లు, చేతులపై బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో నిందితులు పరారయ్యారు. దీనిపై బాధితుడు నిరంజన్ నాయుడు తిరుపతి వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నానికి పాల్పడింది ఎవరు? అందుకుగల కారణాలేమిటనే విషయాలపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.



గాయపడిన నిరంజన్

బత్తినయ్య కోనకు 'కన్నప్ప' బృందం



మోహన్‌బాబు

ఏర్పేడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మునలిపేడు సమీపంలోని బత్తినయ్యస్వామి కోనకు సోమవారం 'కన్నప్ప' యూనిట్ వచ్చింది. ఈ సందర్భంగా మోదుగులపాళెం, మునలిపేడు గ్రామస్థులు వీరికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మోహన్ బాబు, మంచు విష్ణు, శివబాలాజీ బత్తినయ్యస్వామి కోనకు వెళ్లి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోలా ఆనంద్, మైలం దయాకర్, మంచు సుధాకర్‌నాయుడు, మంచు మస్తాన్‌నాయుడు, పులిపాటి చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మంచు విష్ణు, శివబాలాజీ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



ఆర్డీవో కార్యాలయం గ్రీవెన్స్‌లో ఉదయం 10:40 గంటలకు మూడు శాఖల అధికారులే హాజరు, ఖాళీగా ఉన్న కుర్చీలు

సూళ్లూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొడుతున్నారు. పలు శాఖల అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలి. సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదకకు డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. పట్టుమని నాలుగైదు శాఖలకు సంబంధించిన అధికారులే హాజరవుతున్నారు. కొందరు అధికారులు 12 గంటలకు కూడా రావడం లేదు. పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్, విద్యుత్తు, ఇరిగేషన్ శాఖల నుంచి అధికారులెవరూ గ్రీవెన్స్‌కు హాజరుకావడం లేదు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ ఆదేశాలిచ్చినా పట్టించుకోవడంలేదు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తయిన నేథ్యంలో 12న స్థానిక సంగం థియేటర్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. కూటమి పార్టీల నాయకులు, అభిమానులుపాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్ రహీమ్, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, జలీల్ అహ్మద్, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, నరసింహులు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, దశరథరామిరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు

వెంకటగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన అమ్మవారి గుడి వద్ద ట్రాఫిక్ ససమస్యను పరిశీలించారు. గుడిమార్గంలో ఆటోలు, ఇతర వాహనాలు తిరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలేరమ్మ ఆర్చి వద్ద నుంచి క్యూలైను ఏర్పాటు చేయడం వల్ల భక్తులు అమ్మవారిని సులభంగా దర్శించుకోగలుగుతారని చెప్పారు. బారికేడ్లతో క్యూలైను ఏర్పాటు చేయడంతో పాటు గుడి ముందు టెంకాయలు కొట్టే ప్రాంతంలో గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని దేవదాశాఖ ఈవో శ్రీనివాసులురెడ్డికి సూచించారు. దేవస్థానం వెనక భాగంలో బొమ్మిడి కాలువలో మట్టి పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని పోలేరమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ గోల్లగుంట మురళీకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. కాలువలో పూడికి తీయించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రమణ, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి



యోగాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వెంకటగిరి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల్లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

బాలాయపల్లి, జూన్ 9(ఆంధ్ర జ్యోతి): ప్రతి రోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తితి దూరమవుతుందని ఏవో వినీల్ కుమార్ అన్నారు. సోమవారం బాలాయపల్లిలో యోగాంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, ఏపీవో జ్యోతి, ఏపీఎం పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రాపై అవగాహన ర్యాలీలు

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సచివాలయాల పరిధిలో సోమవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీలు జరిగాయి. కేశవరం, చిట్టేడు, చెందోడు, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, కోట పంచాయతీ కార్యదర్శులు అల్లాభక్షు, పోలయ్య, కిరణ్, రియాజ్ ఉద్దీన్, సుమలత, రాజశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వాకాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర్‌రావు, వెలుగు ఏఎస్‌ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: యోగాంధ్ర కార్యక్రమంపై సోమవారం ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి బయలుదేరి ఓజిలిలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సుబ్బరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ చౌదరి, వైద్యసిబ్బందితో పాటు టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ రఫీ, నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: యోగాంధ్ర కార్యక్రమంపై ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ సాగింది. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తడ: ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ జరిగింది. తడకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో తడ, తడకండ్రిగ సర్పంచులు ఆర్ముగం, జయప్రద, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, గాబ్రియల్, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండలంలోని అరవపాళెం క్లస్టర్ పరిధిలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్ ఫలితాల్లో శివానీ స్టడీ సర్కిల్ విద్యార్థులను ప్రతిభచాటారు. స్టడీసర్కిల్ నుంచి 113 మంది రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సూళ్లూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక రోటరీక్లబ్ హాలులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తోందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

ఓజిలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని మందలించినందుకు ఓజిలి మండలం భువనగిరిపాళెం గ్రామానికి చెందిన రాజాబాబు(51) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ స్వప్న తెలిపారు. తాగుడుకు బానిసైన రాజాబాబును కుటుంబ సభ్యులు రెండు రోజుల కిందట మందలించారు. దీంతో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు



విన్నమాల రోడ్డులోకి చొచ్చుకొచ్చిన దుకాణాలు - అక్రమ కట్టడాలు

ఒకప్పటి జాతీయ రహదారి!

- ఆక్రమణదారుల చెరలో విన్నమాల రోడ్డు
- ప్రభుత్వ కార్యాలయాలకు అదేదారి
- నిత్యం రాకపోకలు సాగిస్తున్న అధికారులు
- కుచించుకుపోతున్నా పట్టించుకోని వైనం

నాయుడుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి విన్నమాలకు వెళ్లే రోడ్డు దాదాపు 35 సంవత్సరాల కిందట చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిగా ఉండేది. ఈ మార్గంలో నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కత్తా ప్రాంతాల నుంచి వాహనాలు చెన్నై వెళ్లేవి. కాలక్రమంలో బైపాస్ రోడ్డు, ఫ్లైఓవర్ బ్రిడ్జి రావడంతో విన్నమాల రోడ్డులో రాకపోకలు తగ్గాయి. అయితే ఈ మార్గంలోనే జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, డివిజనల్ ట్రెజరీ, డీఎస్పీ, తహసీల్దారు తదితర కార్యాలయాలకు అధికారులతో ప్రజలూ రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం గల విన్నమాలరోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో జాతీయ రహదారి కాస్త చిన్నవీధిలా మారిపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు మొత్తం జలమయంగా మారుతోంది. అధికారులు స్పందించి విన్నమాల రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది.

యోగా సాధనతో ఒత్తిడిలేని ఆరోగ్యకర జీవనం



యోగాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం ద్వారా ఒత్తిడిలేని, ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్‌రెడ్డి ప్రభుత్వ స్టేడియం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఏకాగ్రత పెరగడంతో పాటు అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవాటుగా చేసుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ నెల 21న యోగా డే సందర్భంగా విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 5 లక్షల మందితో యోగా సాధన చేస్తారన్నారు. అదే రోజు స్థానిక ఏఎస్‌రెడ్డి స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, నటశేఖర్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఆరికట్ల మస్తాన్ నాయుడు, డాక్టర్ రమణయ్య, కట్టా మురళీకృష్ణ, రాజా, క్రీడాకారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి, - గూడూరు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, అధికారులు

పేదరికం లేని సమాజం కోసమే స్వర్ణాంధ్ర విజన్-2047

సూళ్లూరుపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో పేదరికం లేని సమాజం.. 2047 నాటికి నూరుశాతం అక్షరాస్యత వంటి సమున్నత లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 పేరుతో ఒక దార్శనిక పత్రాన్ని రూపొందించిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో కిరణ్మయి, నియోజవకర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దులుగా చేసుకుని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ దార్శనిక పత్రాన్ని విడుదల చేశారన్నారు. విజన్ ద్వారా నియోజకవర్గ స్థాయిలో ఒక పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని రూపుమాపడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి పేదరికంలేని సమాజం కోసం ముందుచూపుతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్-2047ను రూపుపొందించిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

గూడూరు: విజన్ 2047పై స్పష్టమైన విధానాలతో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్‌రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, ఇరిగేషన్ ఏఈ సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు



ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పెళ్లకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన కాలవ పోరంబోకు భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని ఎర్రగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 235లో 14.30 ఎకరాల కాలువ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైనట్లు తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాలతో మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో రమేష్ భూములను పరిశీలించి నివేదిక ఇచ్చారు. సోమవారం సదరు భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, జేవీవీ సభ్యులు

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రామ్మోహన్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, రామ్మోహన్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, సుమన్, సురేష్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

చంద్రగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరెడ్డివారిపల్లెలో యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరికి చెందిన హర్షిణి(25)కి ఎగువరెడ్డివారిపల్లెకు చెందిన నవీన్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. నవీన్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం భర్త తిరుపతికి వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో హర్షిణి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జరుగుమల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత విష గుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు తిని అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

డక్కిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే ఆధారమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, సర్వేయర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులను అవార్డులు వరించాయి. పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరిట అవార్డులను ప్రకటించింది. సోమవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రగతి విద్యాసంస్థలకు చెందిన సాత్విక్, అశ్విత, రిత్విక్, శ్రీకృష్ణను షీల్డ్‌లతో అభినందించారు. ఒక్కొక్కరికి రూ.20వేల నగదు పురస్కారాలను అందించారు.

డ్రోన్ సర్వే

కోట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి, సిద్ధవరం పంచాయతీల్లో భూములను సోమవారం డ్రోన్ ద్వారా సర్వే చేశారు. వీఆర్వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం డ్రోన్‌లతో సర్వే చేసి వివరాలను సేకరించారు. ఆయా పంచాయతీల్లో ఉన్న భూములను పరిశ్రమలకు కేటాయించనున్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

గూడూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని ఆ సంఘ నాయకుడు దేవదాసు అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిసింద్రి, శివ, విజయలక్ష్మి, మస్తాన్, వెంకటేశ్వర్లు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఎఫ్ఎస్ భూముల పరిశీలన



భూముల లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రశేఖరపురం చెరువు సమీపంలో ఉన్న సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములను సోమవారం తహసీల్దారు జయజయరావు పరిశీలించారు. ఇక్కడ డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయంటూ రెండు రోజుల క్రితం 'ప్రభుత్వ భూముల్లో పెద్దలపాగా' అన్న వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. చెరువు లోతట్టు భాగంలో ఉన్న గూడలి బీట్-2 పంచాయతీ సర్వే నెంబరు 249-2, 291-3లో ఉన్న డీకేటీ, సీజేఎఫ్ఎస్ భూములను సర్వేయర్ బృందంతో వెళ్లి పరిశీలించారు. ఆయా ప్రభుత్వ భూముల్లో ఎవరెవరు లబ్ధిదారులు ఉన్నారో ఆరా తీశారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి

డక్కిలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని ఆల్తూరుపాడు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు నిమ్మ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త బండెప్ప మాట్లాడుతూ కృషి విజ్ఞన కేంద్రం విధులు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యం, యంత్ర పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడడం మంచిపద్ధతి కాదన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకు పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీవీరమణయ్య, శంకరయ్య, రమేష్, భాస్కర్‌రెడ్డి, నారాయణ, ముత్యాలయ్య, చంద్రయ్య, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

వెంకటగిరిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 4500మంది కాంట్రాక్టు కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంజుల, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య, నారాయణ, రత్నమ్మ, నవీన్, చందు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోండి

నాయుడుపేట టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 4500మంది కాంట్రాక్టు కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ సహాయకురాలు స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అబ్దుల్లా, వెంకయ్య, సుబ్బయ్య, ముత్యాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్నూరు గ్రామంలో సోమవారం తిరుపతిలోని వెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (సిమ్స్) ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామంలో క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.